నేడు కలెక్టరేట్‌లో స్పందన

పుట్టపర్తి, జనవరి 28: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాస్థాయి స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ అరుణ్ బాబు ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని కోరారు.



ట్యాబ్‌లతో ఆర్భాటం!

నెట్ సౌకర్యం, చార్జర్లు, క్యూఆర్ కోడ్, కంటెంట్ లేకుండా పంపిణీ

- వినియోగంలో విద్యార్థుల ఇక్కట్లు
- అటకెక్కుతున్న చదువులు
- పక్కదారి పడుతున్న టెక్నాలజీ
- రోజుకో సిలబస్.. పూటకో జీఓ
- తలలు పట్టుకుంటున్న ఉపాధ్యాయులు

రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం ప్రచార ఆర్భాటంగానే మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ట్యాబ్‌లు ఇస్తున్నారు కానీ, ఎలా వాడాలో శిక్షణ ఇచ్చింది లేదు. ట్యాబ్‌లకు అవసరమైన సామగ్రి కూడా పంపిణీ చేయలేదు. కొన్నింటికైతే కంటెంట్ కూడా లేకుండానే పిల్లలకు ఇచ్చేశారట. దీంతో వాటిని ఏం చేసుకోవాలని టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఆన్‌లైన్ బోధన అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం బైజూస్ సంస్థతో ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. ఇంతకాలం పరిమిత ఒప్పందాలతో సరిపెట్టిన ప్రభుత్వం తాజాగా ఎట్టి పరిస్థితుల్లోనూ ఆన్‌లైన్ విద్యాబోధన చేపట్టాల్సిందేనని ఆదేశాలు జారీ చేసింది. ట్యాబ్‌ల వినియోగంపై ప్రభుత్వం ఎలాంటి శిక్షణ ఇవ్వకుండా ఏకంగా 8వ తరగతి విద్యార్థులకు వాటిని అందించింది. సక్రమమార్గంలో వాటిని వినియోగిస్తే మంచిదే కానీ, పక్కదారి పడితే ఇబ్బందులు తప్పవు. జిల్లావ్యాప్తంగా 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 16,534 మంది ఉన్నారు. వీరిలో 11000 మందికి ఇప్పటి వరకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు.

- ధర్మవరం



పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలనీ, అవి వారి జీవితాలపై ప్రభావం చూపుతాయని మానసిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వమే నేరుగా ట్యాబ్‌లను వారికి అందించడంతో తల్లిదండ్రులు కలవర పడుతున్నారు. ట్యాబ్‌లలో విద్యార్థులు కంటెంట్ ఎంతసేపు చూస్తున్నారు, ఏమి చదువుకుంటున్నారన్న విషయాలతోపాటు వాటిని జాగ్రత్తగా గమనించడం, పాడైతే మరమ్మతులు చేయించడం ఉపాధ్యాయులకు పెద్ద తలనొప్పిగా మారింది. ఎక్కువ మంది విద్యార్థులు పాఠశాలల్లో ట్యాబ్‌లను పక్కన పెట్టినా, ఇళ్లకు వెళ్లిన తరువాత వారి ఇష్టానుసారంగా వాడేస్తున్నారని తల్లిదండ్రులు చెప్తున్నారు. గతంలో ఇలాంటి ఇబ్బందులు లేకుండా తరగతి గదిలో ఉపాధ్యాయుడు బోధించే పాఠాలను శ్రద్ధగా వినడం, నోట్స్ రాసుకోవడం, ఇంటికెళ్లి చదువుకోవడం, తమ అభిప్రాయాలను ఉపాధ్యాయులతో పంచుకోవడాన్ని విద్యార్థులు చేసేవారు. ప్రస్తుతం పరిస్థితులు అందుకు భిన్నంగా మారిపోయాయి. ఉపాధ్యాయుడికి భోజన సమయం దొరకడమే గగనంగా మారింది. ఉపాధ్యాయులు పాఠశాలలకు వచ్చినప్పటి నుంచి రిజిస్టర్లు, యాప్‌లతో కుస్తీ పడడం, ఫొటోలను అప్‌లోడ్ చేయడం, సమావేశాలకు హాజరు కావడంతోనే సమయమంతా గడిచిపోతోంది. ఈ క్రమంలో అత్యధిక శాతం విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల వైపు అడుగులు వేస్తున్నారని ఉపాధ్యాయులు అంటున్నారు.

తల్లిదండ్రుల్లో కలవరం





టీచర్ల ఆందోళన

రాష్ట్ర ప్రభుత్వం ప్రచార ఆర్భాటానికిపోయి బోధనను జఠిలం చేస్తుండటంతోపై ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కంటెంట్ ఎలా ఉన్నా అసభ్య చిత్రాలను తిలకించకుండా పిల్లలను కనిపెట్టుకుని ఉండటంవారికి తలకు మించిన భారంగా మారుతోంది. వైసీపీ అధికారంలోకి వచ్చాక విద్యావ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమయిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకో సిలబస్, పూటకో జీఓతో ఉపాధ్యాయులు కూడా తలలు పట్టుకుంటున్నారు. రెండేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తీవ్రంగా తగ్గిపోతున్నా.. వాస్తవ పరిస్థితులను దాచిపెడుతున్నారన్న విషయాన్ని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇటీవల పంపిణీ చేసిన ట్యాబ్‌లను పరిశీలిస్తే వాస్తవాలు వెల్లడవుతున్నాయి.

మిగిలిన ట్యాబ్‌లు రాగానే పంపిణీ చేస్తాం

మొదటి విడత కింద ప్రభుత్వం 11000 ట్యాబ్‌లను పంపిణీ చేసింది. వాటిని ప్రస్తుతం 8వతరగతి చదువుతున్న విద్యార్థులకు అందించాం. మిగిలిన విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లు సరఫరా చేయగానే పంపిణీ చేస్తాం.

- నాగరాజు, విద్యాశాఖ ఏడీ, శ్రీసత్యసాయి జిల్లా

పనిచేయని ట్యాబ్‌లు

జిల్లాలో ట్యాబ్‌లకు అవసరమైన చార్జర్లు, క్యూఆర్ కోడ్, చిప్‌లు లేకుండానే పంపిణీ చేశారన్న విమర్శలున్నాయి. మరికొన్ని ట్యాబ్‌లలో కంటెంట్ లేకుండా ఇవ్వడంతో అవి అలంకారప్రాయంగానే మారాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యాసంవత్సరం నాలుగు నెలల్లో పూర్తవుతుండగా ప్రచార అర్భాటం కోసమే ట్యాబ్‌లను పంపిణీ చేశారన్న విమర్శలు అన్నివర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఇచ్చిన వాటికి కూడా సరైన సామాగ్రి అందలేదని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ట్యాబ్‌లు పంపిణీ చేసిన ప్రాంతాల్లో ఇంటర్నెట్ సదుపాయం సరిగాలేక హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులే సొంత నిధులు వెచ్చించి ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తున్నారు. ప్రభుత్వం ఈ బాధ్యతను ఏపీ ఫైబర్ నెట్‌కు అప్పగించింది. సమస్యలను తెలియజేస్తే వారు స్పందించకపోవడంతో పాఠశాలలో ట్యాబ్‌ల వినియోగం కష్టతరంగా మారింది. దీంతో విద్యార్థులు ఇంటికెళ్లిన తరువాత వారి ఇంటర్నెట్‌ను వినియోగించుకుని ట్యాబ్‌లను వాడేస్తున్నారు. దీంతో చదువులు కొండెక్కుతున్నాయి.

దళిత ద్రోహి జగన్మోహన్‌రెడ్డి

జీకే పార్థసారథి



పెనుకొండ, జనవరి 28: దళిత ద్రోహి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి విమర్శించారు. ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ వైసీపీ అంటే కేవలం జగన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డి, సజ్జల రామక్రిష్ణారెడ్డి అని, వారందరూ ఒకే సామాజికవర్గానికి చెందిన వారన్నారు. ఇతరులకు ఆ పార్టీలో చోటులేదన్నారు. ఒక సామాజికవర్గం చేతిలోనే పార్టీ నలిగిపోతోందన్నారు. వైసీపీలో ఎస్సీలకు సరైన గౌరవం దక్కలేదన్నారు. ఆ పార్టీలో ఉన్న ఎస్సీలు జగన్‌రెడ్డి నియంతృత్వ పోకడలతో సతమతమవుతున్నారన్నారు. చిత్తూరు, రాయలసీమ జిల్లాల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఓ నియంతలా వ్యవహరిస్తున్నారన్నారు. పార్టీ నాయకులు ఆయన చెప్పుచేతల్లో ఉండాలని భావిస్తున్నారన్నారు. ఆయన నియంతృత్వ పోకడల కారణంగా రాయలసీమ జిల్లాల్లో ఎన్నో అరాచకాలు జరుగుతున్నాయన్నారు. ఎటుచూసినా రాష్ట్రానికి అప్పులు తప్ప.. ఏమీ కనిపించడం లేదన్నారు. దళితులపై దాడులు జగన్‌రెడ్డి ప్రభుత్వంలోనే ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఇసుక అక్రమ రవాణాను ఆపినందుకు ఓ దళితుడిని పోలీసులు గుండు కొట్టించి అవమానించారన్నారు. వీటన్నింటిని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి గట్టిగా బుద్ధి చెబుతారన్నారు.

తత్కాల్ ద్వారా ఇంటర్ ఫీజు చెల్లించొచ్చు

పుట్టపర్తి, జనవరి 28: పలు కారణాలతో ఇంటర్మీడియట్ పరీక్షల ఫీజు చెల్లించలేని విద్యార్థుల కోసం తత్కాల్ ద్వారా ఫీజు మరో అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి రఘునాథ్ రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. రూ. 3 వేల అపరాధ రుసుంతో సోమవారం సాయంత్రం 5 గంటల్లోగా చెల్లించవచ్చునన్నారు. ఫీజు చెల్లించని ఇంటర్ రెగ్యులర్, ప్రైవేట్, జనరల్, ఒకేషనల్ విభాగాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటివరకూ ఫీజు చెల్లించని విద్యార్థులు వెంటనే ఫీజు చెల్లించేలా కళాశాలల ప్రిన్సిపాళ్లు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.





నాయకుడికి సామాజిక స్పృహ అవసరం



సాయి ప్రేరణ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ట్రస్టు సభ్యులు

పుట్టపర్తి, జనవరి 28: విద్య ఉంటే సరిపోదనీ, వ్యక్తిత్వంతో కూడిన సామాజిక స్పృహ ఉన్నవారే నాయకుడిగా ఎదగగలరని సత్యసాయి సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్ పాండే పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రశాంతి నియంలోని సాయికుల్వంత్‌లో శ్రీసత్యసాయి నేషనల్ లీడర్ షిప్ సదస్సు మూడోరోజు కార్యక్రమాలు కొనసాగాయి. మొదట వివిధ రాష్ట్రాలకు చెందిన యువత సాయికుల్వంత్‌కు చేరుకున్నారు. ఈసందర్భంగా సత్యసాయి సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్ పాండే మాట్లాడుతూ.. సత్యసాయి విద్యార్థులు సామాజిక స్పృహతోపాటు ఉన్నత వ్యక్తిత్వంతో సేవలందిస్తూ, నాయకత్వ లక్షణాలతో ముందుకెళ్తున్నారన్నారు. యువత సేవలు, అధ్యాత్మికత, భజనలు, నారాయణ సేవలను కొనసాగించాలని సూచించారు. 2026నాటికి సత్యసాయి నేషనల్ లీడర్ షిప్ కార్యక్రమంతోపాటు సేవలను ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించడానికి యువత కృషి చేయాలన్నారు. అనంతరం సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, సభ్యులు చక్రవర్తి, నిమీష్ పాండే 'సాయి ప్రేరణ' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పట్టభద్రులకు చక్రవర్తి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. యువత భక్తిగీతాలు అలపించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు గోపి, వర్మతోపాటు వివిధ రాష్ట్రాలకు చెందిన యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

కారు బీభత్సం

మద్యం మత్తులో డ్రైవింగ్.. వేర్వేరుచోట్ల ఐదుగురిని ఢీకొన్న వైనం.. తండ్రి, కొడుకు మృతి.. మరో ముగ్గురికి గాయాలు



ప్రమాదానికి కారణమైన కారు






గురుస్వామి, రాజేంద్ర మృతదేహాలు

హిందూపురం, జనవరి 28: మద్యం మత్తులో కారు డ్రైవ్ చేస్తూ బీభత్సం సృష్టించారు. వేర్వేరుచోట్ల ఐదుగురిని ఢీకొట్టారు. ముగ్గురు వ్యక్తులు కర్ణాటకలో మద్యం తాగి, కారును అతివేగంగా నడుపుకుంటూ శ్రీసత్యసాయి జిల్లాలోకి ప్రవేశించారు. పరిగి మండలంలోని మోదా గేటు వద్ద రోడ్డు పక్కన నిలబడి ఉన్న ఇద్దరిని ఢీకొట్టారు. వారిద్దరికీ గాయాలయ్యాయి. అయినా ఆపకుండా అదే మండలంలోని సేవామందిరం బిందునగర్ వద్ద నడుచుకుంటూ వెళ్తున్న కొడిగెనహళ్లికి చెందిన గురుస్వామి (57), అతడి కుమారుడు రాజేంద్ర (32)ను ఢీకొట్టారు. ఆ తర్వాత అదే ప్రాంతంలో మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి కారు అదుపుతప్పి గుంతలోకి దూసుకెళ్లి ఆగిపోయింది. అందులో ముగ్గురు ఉండగా.. ఇద్దరు పరారైనట్లు తెలిసింది. ఒకరు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. బైక్‌లో ఉన్న మండలంలోని ముళ్ల మోతకపల్లికి చెందిన గోపాల్‌రెడ్డి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గురుస్వామి, రాజేంద్ర, గోపాల్‌రెడ్డిని హిందూపురం ఆస్పత్రికి తరలించారు. గురుస్వామి, రాజేంద్ర మృతిచెందారు. గోపాల్‌రెడ్డి చికిత్స పొందుతున్నాడు. మోదా గేటు వద్ద గాయపడిన ఇరువురి వివరాలు తెలియాల్సి ఉంది. వారికి స్వల్పగాయాలు కావడంతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని వెళ్లినట్లు సమాచారం. మృతిచెందిన గురుస్వామి పట్టుపరిశ్రమ శాఖ ఉద్యోగి అని తెలిసింది. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాజేంద్ర కర్ణాటకలోని తుమకూరులో గల ఓ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తుండేవారు. ఆయనకు భార్య కల్పన, మూడేళ్ల కుమారుడు ఉన్నట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. కారును స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటకలోని మధుగిరి రోడ్డులో ఉన్న ఓ మద్యం షాపు వద్ద మద్యం సేవించి, హిందూపురం వైపు కారు నడుపుకుంటూ వచ్చినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అగ్నిప్రమాదంపై దోబూచులాట

- నాసిన్‌లో మధ్యాహ్నం 2 గంటలకే మంటల ఆర్పివేత
- వివరాలు వెల్లడించని అగ్నిమాపక శాఖాధికారులు
- భారీ మొత్తంలో నష్టం వాటిల్లినట్లు అంచనా



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

హిందూపురం, జనవరి 28: గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామ సమీపానగల నాసిన్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, పరోక్ష పన్నులు, నార్కోటిక్స్)లో ఆదివారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. పెనుకొండ, పుట్టపర్తి నుంచి అగ్నిమాపక యంత్రాలు వచ్చి ఆర్పివేశాయి. మధ్యాహ్నం 2 గంటల సమయానికి మంటలు పూర్తిగా ఆర్పేసినా సాయంత్రం 5 గంటలైనా అగ్నిమాపక వాహనాలు అక్కడే ఉన్నాయి. నష్టంపై అటు నాసిన్ అధికారులుగానీ, ఇటు అగ్నిమాపక సిబ్బందిగానీ వివరాలు వెల్లడించడానికి నిరాకరిస్తున్నారు. సాధారణంగా అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే అగ్నిమాపక సిబ్బంది వివరాలు వెల్లడిస్తారు. నాసిన్ ప్రమాద నష్టం వివరాలు వెల్లడించడానికి అగ్నిమాపక సిబ్బంది నిరాకరించడం వెనుక ఆంతర్యం ఏమిటన్నది అధికారులే చెప్పాలి. ఎంత మొత్తంలో నష్టం జరిగింది, ఏయే సామగ్రి దగ్ధమయ్యాయనేది బయటకు పొక్కలేదు. మధ్యాహ్నం 2 గంటలకే మంటలను ఆర్పినా సాయంత్రం 7 గంటల సమయంలో కూడా అగ్నిమాపక సిబ్బంది నాసిన్‌లో అగ్ని ప్రమాదం జరిగిందనీ, తాము ఇక్కడే ఉన్నట్లు పై అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. భారీ మొత్తంలో నష్టం వాటిల్లి ఉంటుందని మంటలు ప్రత్యక్షంగా చూసినవారు పేర్కొంటున్నారు. ఈనెల 16న ప్రధాని నరేంద్రమోదీ నాసిన్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే.

ముగిసిన గడువు... పూర్తికాని కులగణన సర్వే!

మడకశిర రూరల్ జనవరి 28: కులగణన సర్వే గడువు ఆదివారంతో ముగిసింది. ప్రభుత్వం ఆశించిన విధంగా గ్రామాల్లో పూర్తిస్థాయిలో సర్వే జరుగలేదు. పది రోజులుగా నిర్వహించిన సర్వేలో 70 నుంచి 80 శాతం వరకే చేయగలిగారు. ప్రభుత్వం తక్కువ సమయం ఇవ్వడంతో సచివాలయ ఉద్యోగులు సెలవు దినాలు కూడా లెక్కచేయకుండా రాత్రింబవళ్లు కష్టపడి కులగణన సర్వే చేశారు. ఈనెల 18 నుంచి 28 వరకు సర్వే పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో సచివాలయ సబ్బంది రోజూ ఉదయం నుంచి రాత్రి వరకు ఇంటింటా సర్వే చేపట్టారు. సర్వే ఆలస్యానికి ముఖ్య కారణం సాంకేతిక సమస్యలతో నెటవర్క్ పనిచేయకపోవడమే. రోజుకు ఒకటి, రెండు మాత్రమే చేయగలిగారు. గ్రామాల్లో చాలా కుటుంబాలు వలసలు వెళ్లడం, ముందస్తు సమాచారం లేక వారు అందుబాటులో లేకపోవడంతో సర్వే పూర్తి స్థాయిలో జరగలేదు.



సెలవు రోజు కూడా సర్వే చేస్తున్న సచివాయ సిబ్బంది



ఆర్. అనంతపురంలో రాత్రి సర్వే చేస్తున్న వీఆర్‌ఓ

మడకశిర ఉప కాలువకు గండి

వంకల పాలైన కృష్ణాజలాలు



కోనాపురం సమీపంలో హంద్రీనీవా కాలువకు గండి పడి వృథాగా పోతున్న నీరు



వంకల గుండా ప్రవహిస్తున్న కృష్ణాజలాలు



వ్యవసాయ పొలాల్లోకి చేరిన నీరు

పెనుకొండ రూరల్, జనవరి 28: మడకశిర ఉప కాలువ నుంచి మడకశిరకు వెళ్లే హంద్రీనీవా కాలువకు గండిపడటంతో నీరంతా వృథా అయ్యాయి. శనివారం సాయంత్రం గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర ఉప కాలువకు హెచ్‌ఎన్‌ఎస్ అధికారులు నీటిని విడుదల చేశారు. ఆదివారం మండలంలోని కోనాపురం సమీపంలో చెలిమి వంకవద్ద హంద్రీనీవా కాలువకు గండిపడటంతో నీరంతా సమీప పంట పొలాల్లోకి వంకల గుండా ప్రవహించింది. హంద్రీనీవా కాలుకు గండిపడటంతో ఆరు చెక్ డ్యామ్‌లు నిండి వంకల ద్వారా నీరు ప్రవహించింది. కాలువకు గండిపడటంతో సమీపంలోని రైతు లక్ష్మీదేవి సాగుచేసిన మామిడితోటలోకి నీరు చేరింది. 500 క్యూసెక్కులు కృష్ణాజలాలు వృథా అయ్యాయి. హెచ్‌ఎన్‌ఎస్ అధికారులు గండిపడిన ప్రదేశానికి చేరుకుని గండిని పూడ్చించారు. గతంలో ఇదే ప్రాంతంలో గండిపడి మొత్తం కాలువ కొట్టుకుపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గండిపడినచోట మరమ్మతులు గట్టిగా చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కొనసాగిన రిలే దీక్షలు

పుట్టపర్తి, జనవరి 28: సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగభద్రత కల్పించాలని డీఆర్‌డీఏ, వైకేపీ ఉద్యోగులు ఆదివారం ఐదో రోజూ రిలే దీక్షలు కొనసాగించారు. జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద శిబిరాన్ని ఏర్పాటుచేసి, దీక్షలు చేపట్టారు. జేఏసీ కోకన్వీనర్ రామమోహన్ మాట్లాడుతూ ఉద్యోగభద్రత కల్పించాలని, పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, బీఓఏలకు మూడు సంవత్సరాలకు రెన్యువల్ సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొండివైఖరిని వీడి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సుధాకర్, శంకర్, వెంకటసత్యం, వేణుగోపాల్, మల్లికార్జున, రావరాంజనేయులు, హరి, రవణమ్మ, శివమ్మ, పద్మావతి పాల్గొన్నారు. టీడీపీ నాయకుడు సామకోటి ఆదినారాయణ రిలేదీక్షలో పాల్గొని మద్దతు తెలిపారు.



రిలేదీక్షలో పాల్గొన్న డీఆర్‌డీఏ వైకేపీ ఉద్యోగులు





నాయకులు, కార్యకర్తలకు అభివాదం చేస్తున్న చంద్రబాబు



చంద్రబాబు బస చేసిన శిబిరం వద్ద కాలవ, సునీత



చంద్రబాబుకు అభివాదం చేస్తున్న పరిటాల సునీత



హెలిప్యాడ్ వద్ద చంద్రబాబుకు వీడ్కోలు పలికేందుకు వచ్చిన టీడీపీ నేతలు

ఘనంగా చంద్రబాబుకు వీడ్కోలు

అనంతపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఆ పార్టీ జిల్లా ముఖ్య నేతలు ఘనంగా వీడ్కోలు పలికారు. ఉరవకొండ నియోజకవర్గ కేంద్రంలో రా.. కదలిరా బహిరంగ సభ ముగిసిన అనంతరం ఆయన ఆ వేదిక సమీపంలోనే శనివారం రాత్రి బస చేశారు. ఆదివారం ఉదయం 10 గంటలకు నెల్లూరు జిల్లాలో ఏర్పాటు చేసిన రా.. కదలిరా బహిరంగ సభకు వెళ్లేందుకు బయలుదేరారు. ఈ సందర్భంగా చంద్రబాబుకు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, జోన్-5 పార్టీ పరిశీలకులు బీద రవిచంద్రయాదవ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, పల్లె రఘునాథరెడ్డి, పరిటాల సునీత, పీఏసీ చైర్మన్, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీధర్ చౌదరి, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి, కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వర నాయుడు, శింగనమల టూమెన్ కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, ఆ నియోజకవర్గ నాయకురాలు బండారు శ్రావణిశ్రీ, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు, జోన్-5 మీడియా కో-ఆర్డినేటర్ బీవీ వెంకటరాముడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడు యాదవ్, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయల్ మురళీ, తెలుగు యువత రాష్ట్ర నాయకులు గుడిపూటి నారాయణస్వామి, సీనియర్ నాయకులు గడ్డం సుబ్రహ్మణ్యం, పురుషోత్తంనాయుడు, గాండ్ల విశాలాక్షి, పెరుమాళ్ల జీవానందరెడ్డి తదితరులు వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా సభ: ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

ఉరవకొండ: రా కదలిరా కార్యక్రమం చరిత్రలో నిలిచిపోయేలా జరిగిందని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రా కదలిరా కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. యావత్తు ప్రభుత్వాన్ని ఉపయోగించి సీఎంకు వచ్చిన జనం కంటే చంద్రబాబు బహిరంగసభకు ఐదు రెట్లు జనం ఎక్కువగా వచ్చారన్నారు. ప్రభుత్వ వ్యతిరేకత ఎంత ఉందో సభను బట్టి అర్థమవుతోందన్నారు. సభ విజయవంతం కావడానికి శ్రమించిన టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీపై నమ్మకంతో ప్రజానీకం స్పందించి తరలివచ్చారన్నారు. దీంతో టీడీపీపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. టీడీపీని గెలిపిస్తున్నామన్న సందేశాన్ని ప్రజలు ఇచ్చారన్నారు.

ప్రైవేటు స్కూల్‌లో అరాచకం...!

బార్‌ను తలపిస్తున్న స్కూల్ ఆవరణ

మద్యం మత్తులో విద్యార్థులను చితకబాదిన హాస్టల్ ఇన్‌చార్జి

మండిపడిన విద్యార్థి సంఘాలు



మందు బాటిళ్లను పరిశీలిస్తున్న నాయకులు



వీపుపై వాతలను చూపుతున్న విద్యార్థి

అనంతపురం విద్య, జనవరి 28: నగరశివారులోని సంసిద్ధ్ స్కూల్‌లో అరాచకం సాగుతోందని, హాస్టల్ ఇన్‌చార్జ్ విజయ్ శంకర్ మద్యం సేవించి విద్యార్థులను చితకబాదుతున్నారంటూ ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడ్డారు. ఆదివారం ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఇతర నాయకులు రమణయ్య, మంజు, హరి, భీమేష్, సోము ఆ స్కూల్‌లో జరుగుతున్న అరాచకాలపై ఆందోళన వ్యక్తం చేశారు. స్కూల్ హాస్టల్ బిల్డింగ్‌లో కుప్పలు తెప్పలుగా నిల్వ ఉంచిన ఖాళీ మద్యం బాటిళ్లను బహిర్గతం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ హాస్టల్ ఇన్‌చార్జ్ విజయ్‌శంకర్ గత కొన్ని నెలలుగా మద్యం సేవించి 10వ తరగతి విద్యార్థులను నిత్యం చితకబాదుతున్నాడన్నారు. అయినా స్కూల్ యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే స్కూల్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఇన్‌చార్జ్ డీఈఓ నాగరాజుకు సమాచారం ఇవ్వగా ఆయన ఆ స్కూల్ ఎక్కడంటూ తమనే ప్రశ్నించే స్థితిలో ఉన్నారంటూ వివరించారు. డిప్యూటీ డీఈఓ శ్రీనివాస్ రావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేశారు. తనిఖీ అనంతరం ఆంధ్రజ్యోతి ఆయనకు ఫోన్ చేయగా పలువురు విద్యార్థులపై వాతలున్నాయన్నారు. సుమారు 30 మంది వరకూ దెబ్బలు తిన్నట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్‌ను ఆరా తీయ్యగా ఆసుపత్రిలో ఉన్నానని, తనకు విషయం తెలియదని చెబుతోందని, దీంతో డీఈఓ కూడా మాట్లాడించానని స్పష్టం చేశారు. హాస్టల్ వార్డెన్ పరారీలో ఉన్నాడని, ఈ సంఘటనపై విచారణ తర్వాత సమగ్రమైన నివేదికను డీఈఓకు ఇస్తానని పేర్కొన్నారు. అయితే సంసిద్ధ్ స్కూల్ ఘటనపై రూరల్ పోలీస్‌స్టేషన్‌పై ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

ప్రతి ఇంటి తలుపు తట్టాలి

కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించాలి

పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



షర్మిలతో కరచాలనం కోసం ఎగబడుతున్న కార్యకర్తలు

అనంతపురం న్యూటౌన్, జనవరి 28: నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటి తలుపు తట్టాలని కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సూచించారు. నగరంలోని లలితకళాపరిషత్‌లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి హాజరైన షర్మిల మాట్లాడుతూ రాజశేఖర్‌రెడ్డి వారసురాలిగా పుట్టింటికి రావడం జరిగిందన్నారు. రాజశేఖర్‌రెడ్డికి ఏపీ, తెలంగాణా రెండు కళ్ల లాంటివని పేర్కొన్నారు. ఏపీ ప్రజలు కష్టాల్లో ఉన్నారని, కొంతవరకైనా వారి సమస్యలను తీర్చగలనన్న నమ్మకంతో వచ్చానన్నారు. తనపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని, దేనికీ భయపడేదిలేదన్నారు. రాష్ట్ర ప్రజలకు న్యాయం జరిగే వరకు పోరాడతానన్నారు. అనంతపురం జిల్లా అంటే వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని ఎనలేని అభిమానమన్నారు. రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో 1000 గ్రామాలకు, 17 మునిసిపాలిటీలకు తాగునీటి కొరత తీర్చిన ఘనత రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రజలకు జగనన్న ఏమి చేశారని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో అతడికి ఎందుకు ఓటు వేయాలన్నారు. వ్యవసాయ పనిముట్లు సబ్సిడీపై ఇచ్చేవారని, ప్రస్తుతం సబ్సిడీ అనే పదమే లేకుండా పోయిందన్నారు. దీనిపై జగనన్న ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కరువు జిల్లాను ఆదుకోవడానికి ప్రాజెక్ట్ అనంతను జిల్లాకు తీసుకురావడం జరిగిందని, తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ, వైసీపీ లు ప్రాజెక్ట్ గురించి పట్టించుకోక గాలికి వదిలివేయడం జరిగిందన్నారు. ఇది నా పుట్టినిల్లు అని, ఇక్కడ ప్రజలకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. ప్రజల హక్కులను హరిస్తున్నారని, వాటిని కాపాడటానికి వైఎస్ఆర్ వారసురాలిగా పోరాటం చేయడానికి వచ్చానన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధమన్నారు. ఇచ్చిన ఏ ఒక్క హామీనీ జగనన్న నెరవేరలేదన్నారు. ప్రతి ఏడాది జనవరి 1న జాబ్ క్యాలెండర్ అన్న జగనన్న ఆ మాటను నిలుపుకోలేకపోయాడన్నారు. ఎన్ని జాబ్‌క్యాలెండర్లు విడుదల చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. మన ఆడబిడ్డగా రాష్ట్ర ప్రజల అభివృద్ధిని కాంక్షిస్తూ వైఎస్ఆర్ ఆశయాలను కొనసాగించేలా షర్మిల మన ముందుకు రావడం జరిగిందని మాజీ మంత్రి రఘువీరారెడ్డి అన్నారు. ఆమె అడుగుజాడల్లో ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త పయనించి కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని సూచించారు. షర్మిల పిలుపు మేరకు మండల, గ్రామస్థాయిల్లో పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి సాకే శైలజానాథ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ద్వారానే అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతుందన్నారు. ప్రాంతీయ పార్టీలకు ఓటు వేస్తే బీజేపీకి ఓటు వేసినట్లేనన్నారు. రాహుల్‌గాంధీని ప్రధానిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు మాజీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుతోపాటు సీనియర్ నాయకులు జేడీ శీలం, కొప్పులరాజు, పలంరాజు, జంగా గౌతమ్, సుధాకర్, దాదాగాంధీ, శంకర్, ప్రతాప్ రెడ్డి, శ్రీధర్, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుమునుపు షర్మిలకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. గజమాలతో ఆమెను సన్మానించారు.

బాధ్యత ఎవరిది..?

ఓటర్ల తుదిజాబితా తప్పుల తడకే

మృతులు, స్థానికేతరులకూ ఓటు యథాతథం

అనంతపురం టౌన్ జనవరి 28: తుదిఓటర్ల జాబితాలో ఎక్కడా పారదర్శకత కనిపించడంలేదు. చనిపోయినవారి ఓట్లు అలాగే ఉండిపోయాయి. డబుల్ ఎంట్రీ, స్థానికేతరుల ఓట్లు జాబితాలో ఉన్నాయి. మరోవైపు ఓటర్ల జాబితా ముద్రణలోనూ ఫొటోలు ఒకరివి ఉండగా పేర్లు మరొకరివి ఉన్నాయి. దీనికి బాధ్యత ఎవరిది అన్న ప్రశ్న తలెత్తుతోంది. అనంతపురంరూరల్ మండల పరిధిలోని కొడిమి, మన్నీల, రాచానపల్లి గ్రామాల్లో మృతిచెందినవారి ఓట్లూ అలాగే ఉంచారు. డబుల్ ఎంట్రీ ఓట్లు, బయటవ్యక్తుల పేర్లతో ఓట్లను జాబితాలో అలాగే ఉంచడం కనిపిస్తోంది. రాయదుర్గం నియోజకవర్గం బొమ్మనహాళ్ మండల పరిధిలోని కానాపురం, ఏళంజి గ్రామాల్లో చనిపోయిన వారి ఓట్లు జాబితాలో అలాగే ఉంచారు. గుంతకల్ మున్సిపాలిటీలో మరణించిన వారిఓట్లు, స్థానికేతరుల ఓట్లు పెద్దఎత్తున బయటపడ్డాయి. ఇక్కడ ఓటర్ల జాబితా అంతా తప్పులు తడకగా రూపొందించారన్న విమర్శలు వస్తున్నాయి. ఇక రాప్తాడు నియోజకవర్గంలోని రాప్తాడు, కనగానపల్లి, ఆత్మకూరు మండలాల్లో కుప్పలు తెప్పలుగా చనిపోయినోళ్లఓట్లు, స్థానికేతరుల ఓట్లు, డబుల్‌ఎంట్రీ ఓటర్లు బయటపడ్డాయి. అనంతపురం రాంనగర్‌కు చెందిన ఓ మహిళా కార్పొరేటర్ పేరు ఆత్మకూరు మండలం తోపుదుర్తిలో ఓటరుగా ఉంచారు. ఇక అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో అనేక వింతలు దర్శనమిస్తున్నాయి. రామచంద్రనగర్, ఆర్‌కేనగర్, నీరుగంటివీధి, రాంనగర్, లక్ష్మీనగర్, వేణుగోపాల్‌నగర్‌లలో ఫొటోలు ఒకరివి పేర్లు మరికరివి ముద్రించారు. డబుల్‌ఎంట్రీ ఓటర్లు, స్థానికేతరుల ఓటర్లు ప్రతి డివిజన్‌లోనూ లెక్క లేకుండా ఉన్నాయి.

ఓటర్ల తుదిజాబితా విడుదల చేస్తూ కలెక్టర్ ఏమన్నారంటే..

జిల్లాలో కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు అందాయి. లక్షల్లో రావడంతో సమయం సరిపోక పూర్తిస్థాయి విచారణ చేయలేకపోయాం. అందుకే గత ఏడాది అక్టోబరులో విడుదల చేసి న ముసాయిదా ఓటర్ల జాబితాలో ఆ పొరపాట్లు, సమస్యలు అలాగే ఉండిపోయాయి, ఇదే విషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లాం. కొన్ని పత్రికలు ఆ తప్పులను చూపుతూ కనీసం మా సమాధానం తీసుకోకుండా పదేపదే కథనాలు రాసాయి. ఇపుడు తుది ఓటర్ల జాబితాలో ఆ సమస్య ఉండదు. ఫిర్యాదులను పక్కాగా పరిశీలించి ఓటర్ల తుదిజాబితాను పారదర్శకంగా తయారుచేసి ప్రకటిస్తున్నాం.

జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితే

అనంతపురం జిల్లాకు సంబంధించి తుదిఓటరు జాబితాలో 19,94,544మంది ఉన్నట్లు కలెక్టర్ గౌతమి అధికారికంగా వెల్లడించారు. జాబితా విడుదల చేసిన తర్వాత రాజకీయ పార్టీల నాయకులు ఓటర్ల జాబితాపై దృష్టిపెట్టారు. ఆది నుంచి అధికార వైసీపీ నాయకులు దొంగ ఓట్లను నమోదు చేయించారని, అధికారులు సైతం వారి ఒత్తిళ్లకు తలొగ్గి చేశారన్న ఆరోపణలు పెద్దఎత్తున వచ్చాయి. ప్రతిపక్ష టీడీపీ ఆధారాలతో జిల్లా, రాష్ట్ర, కేంద్ర ఎన్నికల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే తప్పులను సవరించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఓటర్ల తుదిజాబితానే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. నియోజకవర్గం గ్రామం ఇలా అన్ని జాబితాల్లోనూ ఓటర్ల జాబితాలో తప్పులు వెలుగులోకి వస్తున్నాయి.



పుట్లూరులో ఒకే ఇంటి నంబరుతో ఏడుగురు వేర్వేరు కులాలకు చెందిన వారి ఓట్లు నమోదైన దృశ్యం

బాధ్యులు ఎవరు..?

తుది ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందించాలని ఎన్నికల కమిషన్ ఉన్నతాదికారులు పదేపదే హెచ్చరిస్తూ వచ్చారు. ఏ చిన్న తప్పు జరిగినా చర్యలు తప్పవని పేర్కొన్నారు. పరిశీలకులు ఐఏఎస్ మురళీధర్‌రెడ్డి కలెక్టరేట్‌లో సమీక్ష చేపట్టి స్వయంగా ఆరాతీసారు, తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందిస్తున్నామని వెల్లడించారు. కలెక్టరు గౌతమి సైతం ఇదే విషయాన్ని చెప్పారు. తీరా చూస్తే తుదిజాబితా తప్పులు తడకగానే కనిపిస్తోంది. బీఎల్‌ఓల నిర్లక్ష్యమా..? కావాలనే ఇలా తుదిజాబితా తయారుచేశారా..? అన్నది అంతుబట్టని విషయంగా మారింది. దీనికి బాధ్యులు ఎవరనేది ప్రశ్నార్థకంగా మారింది.

పెండింగ్ ఫిర్యాదుల సంగతేంటి..?


జిల్లాలో తుది ఓటర్ల జాబితా ఇచ్చినా జిల్లావ్యాప్తంగా ఇంకా 15,905 ఫిర్యాదుల పరిశీలన పెండింగ్‌లో ఉన్నాయి. ఇదేవిషయాన్ని కలెక్టరు జాబితా విడుదల చేసేరోజు తెలిపారు. ఇందులో7361 ఫారం-6 ఉండగా 5424ఫారం-7 ఉన్నాయి. అదేవిధంగా 3120ఫారం-8 ఉన్నాయి. వీటిని పూర్తిస్థాయిలో పరిశీలించి అర్హులను ఓటర్ల జాబితాలో చేరుస్తామని కలెక్టరు అన్నారు. ఇపుడు ఇచ్చిన ఓటర్ల జాబితానే తప్పుల తడకగా ఉంది ఇక ఈపెండింగ్ ఫిర్యాదులను ఏమి చేస్తారోనన్న అభిప్రాయం ఓటర్లలో వ్యక్తమవుతోంది.

'తుది'లోనూ అవే తప్పులు

శింగనమల: ఓటర్ల తుది జాబితానూ అవే తప్పులున్నాయి. ఇంటింటా పకడ్బందీగా నిర్వహించిన సర్వేలో ఓటర్ల జాబితాలో త్రిబుల్, డబుల్ ఎంట్రీలు ఉన్నట్లు వెలుగుచూసిన విషయం తెల్సిందే. వాటిని సరిచేశామని అధికారులు వెల్లడించినా తుది జాబితాలో తప్పులు అలాగే ఉన్నాయి. శింగనమల 85 పోలింగ్ బూత్‌లో సీరియల్ నెంబర్ 61, 666 కొప్పెర్ల శ్రావణి, తండ్రిపేరు పార్థసారథిరెడ్డి వరుస నెంబర్‌లోనే డబుల్ ఎంట్రీలు చేశారు. అలాగే అదే బూత్‌లోనే సీరియర్ నెంబర్ 61, 667లో కొప్పెర్ల పవన్‌కుమార్‌రెడ్డి, తండ్రి పేరు కొప్పెర్ల పార్థసారథిరెడ్డి పేరు మీద డబుల్ ఎంట్రీలు ఉన్నాయి. బూత్ నెంబర్ 84లో సీరియల్ నంబర్ 1023, 1130లో మంగళ నాగేంద్ర తండ్రి పేరు మంగళ చితంబరప్పతో డబుల్ ఎంట్రీలు చేశారు. మండలంలో ఇలా చాలా డబుల్ ఎంట్రీలు ఉన్నాయి. అంతేకాకుండా మరణించిన వారి ఓట్లను కూడా తొలగించలేదన్న విమర్శలున్నాయి.



శింగనమలలో బూత్ నంబర్ 85లో త్రిబుల్ ఎంట్రీలు



డబుల్ ఎంట్రీ ఓట్లు

మృతులకూ ఓటు హక్కు!

పెద్దవడుగూరు, జనవరి 28: ఓటరు తుదిజాబితాలో మృతిచెందిన వారి ఓట్లను సైతం తొలగించకపోవడం విమర్శలకు తావిస్తోంది. మండలకేంద్రంలోని హనుమంతరెడ్డి ఓటరు ఐడీ జీవీఎల్1851971, అతడి భార్య కమలమ్మ ఐఎఫ్‌హెచ్ 1974468 మృతిచెందారు. అయినా వారి పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించి తుదిజాబితా తయారుచేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం కారణంగా ఇలా తప్పులతడకగా ఓటరు జాబితా తయారైందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ముసాయిదాకు, తుది జాబితాకు వ్యత్యాసమేదీ?

యాడికి, జనవరి 28: మండలంలోని వేములపాడు గ్రామానికి చెందిన ఓటరు తుది జాబితాలో మృతి చెందిన వారి ఓట్లు కూడా తొలగించలేదు. ముసాయిదా ఓటరు జాబితాకు, తుది జాబితాకు వ్యత్యాసం లేదు. వేములపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని వేములపాడు, కొట్టాలపల్లి, తిమ్మాపురం, వీ. పెండేకల్లు గ్రామాల్లో 2200మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 220మంది ఓటర్లు మృతులు, గ్రామం విడిచి వెళ్లిన వారే ఉన్నారు. 10శాతం ఓట్లు వీరివే ఉన్నాయి. ముసాయిదా ఓటరు జాబితా సమయంలోనే వీటిని తొలగించాలని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయింది. క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు సరిగా పనిచేయకపోవడం వల్లే ముసాయిదా ఓటరు జాబితాకు, తుది జాబితాకు వ్యత్యాసం లేకుండా పోయిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.



తుది జాబితాలో తొలగించని మృతుల ఓట్లు



వేములపాడులో తుది జాబితాలోనూ తొలగించని మృతుల ఓట్లు, గ్రామంలో లేనివారి ఓట్లు

ఒకే ఇంటి నంబరులో మూడు కులాల ఓట్లు


పుట్లూరు, జనవరి 28: మండలంలో ఓటర్ల జాబితా తప్పుల తడకగా వచ్చింది. నూతన జాబితాలో కూడా ఒకే ఇంటి నంబరులో మూడు కులాల ఓట్లతోపాటు మరణించిన వారి ఓట్లు తొలగించలేదు. కొండుగారికుంట గ్రామంలో ఇంటి నెంబర్ 1-91లో బీసీ, ఎస్సీ, ముస్లింల ఓట్లు ఉన్నాయి. వరుస నెంబర్ 420, 421, 422, 423, 424, 425, 426వరకు ఇంటినెంబర్ 1-91 పేరిట ఏడుగురు ఎస్సీ, బీసీ, ముస్లిం ఓటర్లు ఉన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్ల జాబితా ఇంకా ఎప్పుడు సక్రమంగా సవరిస్తారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మళ్లీ అవే తప్పులు ..

ధర్మవరం: పట్టణంలోని తుదిజాబితాలో అధికార పార్టీ సానుభూతిపరుల ఓట్లు డబుల్‌ఎంట్రీలు కనిపిస్తున్నాయి. అంతేకాకుండా మృతిచెందిన వారి ఓట్లు కూడా అలాగే ఉన్నాయి. వేరొక మండలంలో నివసిస్తున్న వారి ఓట్లు దర్శనమిస్తున్నాయి. 25వ వార్డులోని జాబితాలో ప్రతాప్‌రెడ్డి పేరు మీద 225వ, 226వ పోలింగ్ బూత్‌లలోని డబుల్‌ఎంట్రీలు ఉన్నాయి. 227పోలింగ్ బూత్‌లో సంజీవరెడ్డి ఓటు రెండు చోట్ల ఉంది. మృతిచెందిన శంకరయ్య పేరును అలాగే ఉంచారు. గ్రీష్మా సానే వివాహమై మూడేళ్లక్రితమే వెళ్లిపోయినా ఆమె పేరు 226వ పోలింగ్ బూత్‌లో అలాగే ఉంది. అదేవిధంగా చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామంలో నివాసం ఉంటున్న సంకాల లక్ష్మీదేవి, సంకల చిన్నవెంకటరాముడు పేర్లు పట్టణంలోని 225 పోలింగ్ బూత్‌లో ఉన్నాయి.



డబుల్ ఎంట్రీగా ఉన్న ప్రతాప్‌రెడ్డి, సంజీవరెడ్డి, గ్రీష్మ సానే ఓట్లు



225వ పోలింగ్‌బూత్‌లో ఉన్న మేడాపురం గ్రామానికి చెందిన సంకాల లక్ష్మీదేవి, సంకాల చిన్నవెంకటరాముడి పేర్లు

ఆర్యవైశ్యులది ఘనమైన చరిత్ర

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్

ఘనంగా జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకారోత్సవ సభ



అభివాదం చేస్తున్న ఆర్యవైశ్యులు

అనంతపురం కల్చరల్, జనవరి 28: సమాజంలో ఆర్యవైశ్యుల చరిత్ర ఎంతో ఘనమైనదని మాజీ మంత్రి, మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ పేర్కొన్నారు. జిల్లా ఆర్యవైశ్య సంఘానికి నూతనంగా ఎన్నికైన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ సభను ఆదివారం జిల్లా కేంద్రంలోని కేటీఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. సభకు టీజీ వెంకటేష్‌తోపాటు ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శేగు షణ్ముఖరావు, మాజీ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు, సీనియర్ రాష్ట్ర నాయకుడు పోతుల సురేష్, పొలిటికల్ కమిటీ చైర్మన్ కోటా సత్యం ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అంతకుముందు పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం నుంచి బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఇదే సమయంలో టీజీ వెంకటేష్‌కు గజమాలతో సత్కారం చేశారు. అనంతరం ఫంక్షన్‌హాల్‌లో నూతన కార్యవర్గం ముఖ్యఅతిథుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేసింది. టీజీ వెంకటేష్ మాట్లాడుతూ థార్ ఎడారి తర్వాత అంతటి దుర్భర పరిస్థితుల్లో అనంతపురం జిల్లా వాతావరణం కనిపిస్తుందన్నారు. రాయలసీమ హక్కుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అనంతపురం జిల్లాలో విస్తృతంగా పోరాటాలు సాగించడం జరిగిందని, భవిష్యత్‌లోనూ పోరాటాలు సాగిస్తామన్నారు. రాష్ట్రంలో బీసీలతోపాటు వైశ్యులనూ ప్రభుత్వాలు ఆదుకోవాల్సిన అవసరముందన్నారు. రానున్న శాసనసభ, రాజ్యసభ ఎన్నికల్లో ఆర్యవైశ్యులకు 5 నుంచి 10 సీట్లు కేటాయించాలని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడుగా సిరిగుప్ప వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడిగా కలవల రామ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పోతుల మనోజ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసులు, కోశాధికారిగా కర్ణాటక సత్యరంగయ్య, అదనపు కార్యదర్శులుగా సత్రసాల మంజునాథ్, సుంకు రమేష్, మహిళా విభాగం అధ్యక్షురాలుగా వంకదారు జయలక్ష్మి తదితర కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు జీపీ రామయ్య, కల్లూరు నాగరాజు, ఆర్యవైశ్య మహాసభ జిల్లా కన్వీనర్ తిరువీధుల జగదీష్‌కుమార్, కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు, పాతూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పిన్ని నాగరత్నం, వైశ్య హాస్టల్ అధ్యక్షుడు ఆదిశేషయ్య, అవోపా జిల్లా అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ మల్లికార్జున, చంద్రమహేష్ పాల్గొన్నారు.

నేడు తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, జనవరి 28: వర్షాభావం వల్ల పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లావ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ తెలిపారు. ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకు ప్రకటించిన రూ. 251 కోట్ల పంటనష్టపరిహారాన్ని సంక్రాంతి పండుగ నాటికి రైతుల ఖాతాల్లోకి జమ చేస్తామని చెప్పి, ఇంతవరకూ ఒక్క రూపాయి కూడా జమ చేయలేదని విమర్శించారు. ఈనెల 23న జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి పంట నష్టపరిహారం గురించి ఏమీ మాట్లాడకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. సోమవారం జిల్లాలోని అన్ని మండల తహసీల్దార్ కార్యాలయ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాల్లో రైతులు, కూలీలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నల్లప్ప అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, నాగేంద్రకుమార్, సావిత్రి, శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు తరిమెల నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి, బాస్కర్, రామిరెడ్డి, మన్నీల రామాంజనేయులు, నిర్మల, వెంకటనారాయణ, ముస్కిన్, శివశంకర్, పోతులయ్య, చెన్నారెడ్డి, నాగేంద్ర, సాకే నాగరాజు, పరమేష్, బాలకృష్ణ, ముర్తుజా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాంభూపాల్

వైఎస్ షర్మిలకు ఘన స్వాగతం



కదిరిలో షర్మిలతో కరచాలనానికి ఎగబడుతున్న కాంగ్రెస్ శ్రేణులు

కదిరిఅర్బన్, జనవరి 28: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదివారం అనంతపురానికి వెళ్తుండగా.. మార్గంమధ్యలోని కదిరిలో ఘనస్వాగతం లభించింది. తిరుపతి నుంచి అనంతపురం వెళ్తున్న ఆమె కదిరిలోని జీవిమాన్ సర్కిల్లోకి రాగానే కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షానృాజ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున బాణసంచా కాల్చి, డబ్బు వాయిద్యాల నడుమ, గజమాలతో స్వాగతం పలికారు. ఆమెతో కరచాలనం చేసేందుకు ఎగబడ్డారు. ఆమె అందరికీ అభివాదం చేస్తూ పలకరించారు. అనంతరం అనంతపురం జిల్లా పర్యటనకు వెళ్లారు. కార్యక్రమంలో నాయకులు మేదర నాగభూషణం, బొగ్గిటి మునికుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అనంతపురం పర్యటనకు వెళ్తుండగా.. ముదిగుబ్బలో కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ బాసినేని ప్రభాకర్ తదితరులు ఘనస్వాగతం పలికారు. ఆమె మండలకేంద్రంలోకి రాగానే.. భారీగా బాణసంచా కాల్చి స్వాగతం పలికారు. అనంతరం మండలం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వాహనాలలో ఆమెతో పాటు అనంతపురం తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు నిషార్ అహ్మద్, నాగరాజు, అనిల్, కాటమయ్య, గిరి, చంద్రశేఖర్, సురేష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

షర్మిల సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

ధర్మవరం: పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అనంతపురంలో ఆదివారం నిర్వహించే సభకు ధర్మవరం నుంచి కాంగ్రెస్ నాయకులు బయలు దేరి వెళ్లారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రంగన అశ్వర్థనారాయణ తన అనుచరులతో కలిసి వెళ్లారు. షర్మిలను కలిసి ధర్మవరంలో చేనేతలు పడుతున్న ఇబ్బందులు, ఆత్మహత్యల గురించి చర్చిస్తానని రంగన అశ్వర్థనారాయణ పేర్కొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన న్యాయవాదులు



హైకోర్టు జడ్జిని సన్మానిస్తున్న బార్‌అసోసియేషన్ ప్రతినిధులు

ధర్మవరం, జనవరి 28: హైకోర్టు జడ్జి జస్టిస్ మన్మధరావును పట్టణంలోని న్యాయవాదులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ధర్మవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బారావు, కార్యదర్శి రాఘవేంద్ర ఇతర న్యాయవాదులు స్థానిక పోలీస్ గెస్ట్‌హౌస్‌లో కలిశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయాలని విన్నవించారు. ఇంకా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం శాలువా, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు ఉన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఒకరి మృతి ● మరొకరికి గాయాలు

బత్తలపల్లి, జనవరి 28: మండలంలోని కోడేకండ్ల వద్ద ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా .. మరొకరు గాయపడ్డారు. వివరాల్లోకెళ్తే.. బుక్కపట్నం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన నరసింహులు, రమేష్ బైక్‌లో ఆదివారం బత్తలపల్లికి వచ్చారు. కొద్దిసేపు అనంతరం తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. మార్గంమధ్యలోని కోడేకండ్ల వద్దకు రాగానే బైక్‌ను బత్తలపల్లి నుంచి కదిరికి వెళ్లే ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తూ ఢీకొంది. ప్రమాదంలో బైక్‌లోని ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వీరిని 108 వాహనంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. నరసింహులు చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందాడు. మృతుడికి భార్య గంగాదేవి, కుమారుడు హర్షవర్ధన్ ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రీనివాసులు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

నల్లమాడ, జనవరి 28: మండలకేంద్రంలోని డిష్ బాబ్‌జాన్ మామిడి తోట సమీపంలో ఆదివారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పులగంపల్లి గ్రామానికి చెందిన సాయికుమార్ బైక్‌లో నల్లమాడ మీదుగా కర్నాటక నాగేపల్లికి వెళ్తున్నారు. అలాగే ఓబుళదేవరచెరువు మండం టి.కుంటపల్లికి చెందిన తిరుపాల్ నల్లమాడ నుంచి స్వగ్రామానికి బైక్‌లోనే వస్తున్నాడు. కాగా మార్గంమధ్యలోని డిష్‌బాబ్‌జాన్ మామిడితోట వద్ద ఆ రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ప్రమాదశాత్తూ ఢీకొన్నాయి. ప్రమాదంలో తిరుపాల్‌కు కాలు విరిగి తీవ్రగాయాలైయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికెళ్లి తిరుపాల్‌ను కదిరి ప్రభుత్వ ఆసుప్రతికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసినట్లు తెలిపారు.

కార్మికులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

ఓబుళదేవరచెరువు, జనవరి 28: భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు కుళ్లాయప్ప, శ్రీరాములు విమర్శించారు. మండల కేంద్రంలో ఆదివారం వారు భవన నిర్మాణ కార్మికుల సంఘం ఎన్నికపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు ఇళ్లపట్టాలు ఇవ్వాలన్నారు. ఈవిషయంపై గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా ఫలితం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా ఇవ్వాలని కోరారు. లేదంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. తర్వాత భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా కిష్టప్ప, సహాయ కార్యదర్శిగా కేశవను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రమణ, సూరి, రవి, మహేష్, చాంద్‌బాషా, శ్రీనివాసులు, సురేంద్ర, ఆంజనప్ప, కేశవ, నాగరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

ఓబుళదేవరచెరువు, జనవరి 28: మండలంలోని కొండకమర్ల పంచాయతీ చెరువు మునెప్పగారిపల్లికి చెందిన యనుముల రామక్రిష్టారెడ్డి (65) గుండెపోటుతో ఆదివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ఫోన్‌ద్వారా మృతుడి భార్య వెంకటమ్మను పరామర్శించారు. మీ కుటుంబానికి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం తమ వంతుగా రూ. పదివేల ఆర్థికసాయం ప్రకటించి.. ఆనగదును స్థానిక టీడీపీ నాయకుల చేత మృతుడి భార్యకు అందించారు. కార్యక్రమంలో మండల మాజీ కన్వీనర్ రాజారెడ్డి, తెలుగురైతు జిల్లా నాయకులు జాకీర్‌అహమ్మద్, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బడిశం రామాంజనేయులు, నాయకులు గంగాద్రి, శంకర్, చంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో బీసీల అణచివేత



జానకంపల్లిలో మాట్లాతున్న సామకోటి ఆదినారాయణ

బుక్కపట్నం, జనవరి 28: వైసీపీ పాలనలో బీసీలు అ ణచివేతకు గురయ్యారని టీడీపీ జిల్లా కా ర్యదర్శి సామకోటి ఆదినారాయణ తెలిపారు. మండలంలోని జానకంపల్లిలో ఆదివారం ఆయన పార్టీ ఆ దేశాల మేరకు బీసీల స మావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో బీసీలు అన్నివిధాలుగా అణచివేతకు గురయ్యారన్నారు. జగన్ ప్రభుత్వం బీసీలపై కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. టీడీపీలోనే బీసీలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందారన్నారు. టీడీపీ పాలనలో బీసీలకు ప్రత్యేక చట్టం, బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. వైసీపీ పాలనలో బీసీ కార్పొరేషన్ నిధులు మంజూరు చేయకపోగా, వచ్చిన అరకొర నిధులు కూడా పక్కదారి పట్టాయని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి బడుగులందరూ ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. టీడీపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ నాయకులు నారాయణస్వామి, చెన్నప్ప, రమణ, గంగాద్రి, వెంకటరాముడు, నాగరాజు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

- వచ్చే ఎన్నికల్లో ప్రజలే జగన్‌కు బుద్ధి చెబుతారు
- భవిష్యత్తుకు గ్యారెంటీలో పరిటాల శ్రీరామ్



ప్రజలకు మినీమేనిఫెస్టో పథకాలను వివరిస్తున్న పరిటాల శీరామ్

తాడిమర్రి, జనవరి 28: ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని, ఎక్కడా ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. మండలంలోని చిల్లకొండయ్యపల్లి గ్రామంలో టీడీపీ శ్రేణులు బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పరిటాల శ్రీరామ్ పాల్గొని వారితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన మినీమేనిఫెస్టో పథకాల గురించి వివరించారు. ఎవరెవరికి ఏయే పథకాలు వర్తిస్తాయో.. ఎంతమేరకు లబ్ధి చేకూరుతుందో తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం తన ఐదేళ్ల పాలనలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. గ్రామాల్లో అయితే కనీస వసతులు అయిన రోడ్లు, డ్రైనేజీలు వంటి వాటిని కూడా ఏర్పాటు చేయలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పడానికి ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. చిల్లకొండయ్యపల్లిలో గ్రామాన్ని కలుపుతూ నిర్మించిన కల్వర్టును కూడా రిపేరి చేయించలేని దీనస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే మళ్లీ రాష్ట్రం గాడిప పడుతుందన్నారు. కనుక టీడీపీ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. తొలుత శ్రీరామ్ గ్రామంలోకి రాగానే నాయకులు, కార్యకర్తలు గజమాలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయ్‌కుమార్, నాయకులు నరేంద్రచౌదరి, మండల కన్వీనర్ కూచి రామ్మోహన్, పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి జనార్ద న్ పతకమూరి, సర్పంచ్‌ల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్, సీనియర్ నాయకులు రఘురాంచౌదరి, ఆదినారాయణ, మాజీ ఎంపీపీ కొడిదెల రాజశేఖర్, సాయి, ముంటిమడుగు హర్ష, రామానాయుడు, రమణ, శ్రీనివాసులు, సాంబ తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలు కాదు.. రాళ్లు: కందికుంట

- వైసీపీ నుంచి టీడీపీలోకి పలువురి చేరిక



సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట వెంకట ప్రసాద్

నంబులపూలకుంట, జనవరి 28: వైసీపీ పాలనలో ప్రజలు సంతోషంగా లేరని, సీఎం జగన్ ప్రవేశపెట్టినవి నవరత్నాలు కాదని, అవి రాళ్లని, వాటి వల్ల ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని టీడీపీ నియోజకవర్గ కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. మండలంలోని వెలిచెలమల క్రాస్‌లో ఆదివారం టీడీపీ నాయకుల, కార్యకర్తల సమావేశం జరిగింది. ఇందుకు కందికుంట విచ్చేశారు. ఆయన రాగానే స్థానిక నాయకులు బైక్ ర్యాలీతో, పూలమాలలు, హారతులతో స్వాగతం పలికారు. అనంతరం సమావేశంలో పలువురు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. వారికి కందికుంట కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు నవరత్నాలు కాదని, రాళ్లు అని పేర్కొన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఏ వర్గం ప్రజలు సంతోషంగా లేరన్నారు. ఈ ప్రభుత్వంలో అన్నీ సమస్యలు, కష్టాలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్‌పీ కుంట మండలం టీడీపీకి పెట్టని కోట అన్నారు. ఇక్కడి ప్రజలు టీడీపీని ఎంతో ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. హంద్రీనీవా కాలువల ద్వారా ఈప్రాంతాన్ని సస్యశ్యామల చేశామని అధికారపార్టీ నాయకులు చెబుతున్నారని, 90 శాతం పనులను గత టీడీపీ హయాంలో పూర్తి చేస్తే, కనీసం 10 శాతం పనులు కూడా వైసీపీ ప్రభుత్వం పూర్తిచేయలేకపోయిందని మండిపడ్డారు. కాంట్రాక్టులు సైతం చేసిన పనులకు బిల్లులు అందక అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. ఎన్నికల హామీలను ఏ ఒక్కటీ సరిగా అమలు చేయలేదని దుయ్యబట్టారు. రాష్ట్రం మళ్లీ అభివృద్ధి పథంలో నడవాలంటే చంద్రబాబు సీఎం కావాలని చెప్పారు. ప్రజలు వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి సహకరించాలని కోరారు. పార్టీలో చేరినవారిలో మాజీ సర్పంచ్ భర్త రఘునాథ్‌రెడ్డి, జనార్ద న్‌యాదవ్, చిన్నయ్య, సొసైటీ మాజీ డైరెక్టర్ గంగిరెడ్డి, వైసీపీ యూత్ కన్వీనర్ వేణుగోపాల్, భాస్కర్‌తోపాటు 40కుటుంబాల వారు చేరారు. కార్యక్రమంలో కన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు, విజయ్‌కుమార్‌యాదవ్, బసిరెడ్డి, నాగేశ్వర్, వెంకటయ్య, బాబు, చిన్నరమయ్య, పోమేనాయక్, నాయకులు, రాజశేఖర్‌బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టోను వివరించండి

- టీడీపీ శ్రేణులకు ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్ కన్వీనర్ మనోహర్‌నాయుడు సూచన



ధర్మవరంలో మాట్లాడుతున్న మనోహర్‌నాయుడు

ధర్మవరం, జనవరి 28: ప్రతి ఒక్కరు ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్‌కన్వీనర్ మనోహర్‌నాయుడు సూచించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఇంటిగ్రేటెట్ ట్రైనింగ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్‌నాయుడు మాట్లాడుతూ... మినీమేనిఫెస్టో పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలియజేసి.. బాండ్ రూపంలో రాసి ఇవ్వాలని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మహాశక్తి పథకాలను, యువగళం నిధి ద్వారా నిరుద్యోగ భృతి, ఏడాదికి రూ.3వేలు అందించే వివరాలను, అన్నదాత పథకం కింద రైతులకు ఏడాదికి ఇచ్చే రూ.20వేలు ఇచ్చే విషయాన్ని తెలియజేసి టీడీపీని ఆశీర్వదించే విధంగా ప్రతి కుటుంబాన్ని అభ్యర్థించాలన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక బీసీలకు ప్రత్యేక చట్టం ద్వారా పార్టీ అండగా ఉంటుందన్నారు. అదేవిధంగా ఓటరు జాబితాపై కూడా ప్రత్యేక దృష్టిసారించి దొంగ ఓట్లు, డబుల్‌ఎంట్రీలను గుర్తించి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కమతం కాటమయ్య, బోయరవి, పరిశే సుధాకర్, భీమనేని ప్రసాద్‌నాయుడు, చింతపులుసు పెద్దన్న, నాగూర్‌హుస్సేన్, రాళ్లపల్లిషరీఫ్, మాధవరెడ్డి, అంబటినత్, బీబీ, మహేశ్, తోటనారాయణస్వామి, సుబ్బయ్య, టైలర్‌గోపాల్, శంకర్ పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండల కేంద్రంలో నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్ కన్వీనర్ మనోహర్‌నాయుడు మాట్లాడారు. చంద్రబాబు ప్రకటించిన మినీమేనిఫెస్టోలోని మహాశక్తి పథకం, తల్లికి వందనం, ఆడబిడ్డనిధి, దీపం పథకం, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, యువగళం, అన్నదాత, బీసీ రక్షణ చట్టం తదితర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. అదేవిధంగా తుది ఓటర్ల జాబితాలో డబుల్‌ఎంట్రీలు, ఇతర తప్పుల తడకలు ఉంటే గుర్తించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌బాబు, కరణంప్రభాకర్, తుమ్మలమనోహర్, సూర్యశేఖర్ రాజు, మహబూబ్‌పీరా, తుమ్మలసూరి, ఆనంద్, రామాంజి, రియాజ్, రఫి, రాధమ్మ, నారాయణస్వామి, రాజు, నంద, జయచంద్ర, వెంకటాద్రి, సూరి, శివయ్య, సోము తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరికలు

కదిరి, జనవరి 28: పట్టణంలోని 18వార్డు మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యుడు కోటగస్తి ఇస్మాయిల్ , ఆయన సతీమణి షమీమ్‌తో పాటు పలువురు మైనార్టీనాయకులు టీడీపీలోకి చేరారు. టీడీపీ నాయకుడు వాల్మీకి పవన్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో, నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కందికుంట కడువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అలాగే టింబర్ యూనియన్, టింబర్ హమాలీ యూనియన్ సభ్యులు దాదాపు 50 మంది పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారందరినీ కందికుంట పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండలంలోని ఎలుగుంటువారిపల్లి, క్యాటర్పు గ్రామాలకు చెందిన దాదాపు 50 కుటుంబాల వారు టీడీపీలోకి చేరారు. కదిరి పట్టణంలోని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ నివాసంలో వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కందికుంట వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వారు కందికుంటను, వాల్మీకి విద్యాసంస్థల అధినేత పవన్‌కుమార్‌రెడ్డిని పూలమాలలతో సత్కరించారు. చేరిన వారిలో రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, క్రిష్టారెడ్డి, రమణ, రమణారెడ్డి, ఆంజనేయులు, ఉత్తన్న, అంజి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండయ్య, మాజీ సర్పంచ్ కాకర్ల రవీంద్రారెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

తాడిమర్రి: మండలంలోని చిల్లకొండయ్యపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న పరిటాలశ్రీరామ్ సమక్షంలో పలువురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు నారాయణస్వామి, చిన్న, శివయ్య తదితరులకు శ్రీరామ్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.



కదిరిలో టీడీపీలో చేరినవారితో కందికుంట, పవన్



చిల్లకొండయ్యపల్లిలో పరిటాలశ్రీరామ్ సమక్షంలో టీడీపీలోకి చేరిన వైపీపీ నాయకులు

కేబుల్ వైర్ చోరీ

బుక్కపట్నం, జనవరి 28: మండలంలోని కడప నాగేపల్లి గ్రామంలో గల పొలంలో బోరు మోటార్‌కు సంబంధించిన కేబుల్ చోరీ అయినట్లు బాధిత రైతు రాజాగౌడ్ ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రైతు మాట్లాడుతూ తమ పొలంలో బోరు మోటారుకు బిగించిన విద్యుత్ వైర్ చోరీకి గురైనట్లు చెప్పారు. నెలరోజుల్లో ఇది మూడవసారి జరిగిందన్నారు. మూడుసార్లు వైర్ చోరీకి గురికావడంతో తీవ్రంగా నష్టపోయినట్లు ఆయన వాపోయారు.

'మూర్ఛవ్యాధి ప్రమాదకరం కాదు'

పెనుకొండ, జనవరి 28 : మూర్ఛ వ్యాధి అనేది ప్రమాదకరమైనది కాదని, క్రమంగా మందులు వాడితే పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. స్థానిక ఘనగిరి పాఠశాల ఆవరణంలో ఆదివారం మూర్ఛవ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేవీవీ జిల్లా కార్యదర్శి హరి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులు గా వైద్యులు గోపాలం, శివనారాయణ, ఈటీ రామ్మూర్తి, అలేఖ్య హాజరై ప్రసం గించారు. శిబిరంలో పెనుకొండ పరిసర ప్రాంతాలకు చెందిన 36మంది వ్యాధిగ్రస్థులకు చికిత్స చేశారు. నెలకు సరిపడ మందులను అందించా రు. ఈ వైద్యశిబిరం ప్రతినెలా నాలుగో ఆదివారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్ అధ్యక్షుడు నబీ, ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్ ఖాన్, సభ్యు లు రాజశేఖర్‌రెడ్డి, యూటీఎఫ్ రమేష్, ఘనగిరిపాఠశాల కరస్పాండెంట్ ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

సెబ్ మెరుపుదాడులు

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కారు, కర్ణాటక మద్యాన్ని చూపుతున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

హిందూపురం, జనవరి 28 : ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ మాధవరెడ్డి రాష్ట్ర సరిహద్దులపై గట్టి నిఘా ఉంచాలని పోలీసులను ఆదేశించారు. దీంతో సెబ్ అధికారులు ఆదివారం మెరుపు దాడులు నిర్వహిం చారు. ఈ క్రమంలో భారీ ఎత్తున కర్ణాటక మద్యం పట్టుకున్నట్లు పుట్టపర్తి టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి, హిందూపురం సెబ్ సీఐ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. లేపాక్షి మండల పరిధిలో దాడులు చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని ఒక కారు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 39కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను సీజ్ చేశామని తెలిపారు. అదేవిధంగా చింతలపల్లి క్రాస్ నుంచి అక్రమంగా కర్ణాటక మద్యం తీసుకొస్తున్న హిందూపురం పట్టణానికి చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 15బాక్సుల మద్యం ప్యాకెట్లు, ద్విచక్రవా హనాన్ని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారి మోహన్‌రెడ్డి చోళసముద్రం హైవేపై కారులో తనిఖీ చేయగా అందులో 20బాక్సులు కర్ణాటక మద్యం పట్టుబడింది. ఇందులో కారును సీజ్ చేయగా మద్యం తరలిస్తున్న వ్యక్తి పరారైనట్లు తెలిపారు.

మాదిగల ఆత్మీయ సమ్మేళనం పోస్టర్ల విడుదల

కదిరిఅర్బన్, జనవరి 28: అనంతపురంలోని అంబేడ్కర్ భవనంలో ఈనెల 31వ తేదీన జరిగే మాదిగల ఆత్మీయ మహా సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మాదిగ ఉద్యోగ సమాఖ్య నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా ఆవరణలో ఆ దివారం వారు ఇందుకు సంబంధించిన పోస్లను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. మాదిగలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారన్నారు. వారిని అనిరంగాల్లో చైతన్యం చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. మాదిగల ఐక్యత కోసం ఏర్పాటు చేసిన మహాసమ్మేళనా న్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్, సభ్యులు సంపత్‌కుమార్, ఆనంద్, రాంప్రసాద్, నాగప్ప, విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం

ధర్మవరంరూరల్, జనవరి28: మండలంలోని గొట్లూరు గ్రామంలో ఆదివారం కేహెచ్ ప్రభుత్వ డిగ్రీకళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శ్రమదానం చేశారు. ముందుగా గ్రామంలోని అనాథాశ్రమంలోని వృద్ధులతో మాట్లాడారు. ఆశ్రమ వ్యవస్థాపకుడు, రచయిత ప్రఫుల్లచంద్ర విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఇతరులకు సహాయం చేసి గుణాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు గ్రామంలో మెయిన్‌రోడ్డు నుంచి ఆంజనేయస్వామి ఆలయం వరకు చెత్తను శుభ్రం చేశారు. ముళ్లపొదలను తొలగించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలుతున్న మద్యం పట్టివేత

ధర్మవరం, జనవరి 28: పట్టణంలో మద్యంను అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 34 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని బోయవీధిలో అక్రమంగా మ ద్యం తరలిస్తున్నట్టు సమాచారం రావడంతో.. వెంటనే తాను సిబ్బంది ఉమాశంకర్, రాజప్పతో కలిసి అక్కడికి వెళ్లానని, ఆత్మకూరు ముత్యాలు అనే వ్యక్తి మమ్మల్ని చూసి పారిపోవాలని ప్రయత్నిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. అతని వద్ద ఉన్న బ్యాగ్‌ను పరిశీలిస్తే 34 మద్యం బాటిళ్ల లభ్యమయ్యాయని చెప్పారు. వాటిని స్వాధీనం చేసుకుని.. అతన్ని అరెస్టు చేశామన్నారు. అనంతరం ఆత్మకూరు ముత్యాలుపై కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు పంపినట్టు సీఐ పేర్కొన్నారు.

గోనుగుంట్ల అనంతరెడ్డికి ఘన నివాళి

బత్తలపల్లి, జనవరి 28: ధర్మవరం మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల అనంతరెడ్డి వర్ధంతిని మండలంలోని మాల్యవంతం గ్రామ సమీపంలో గల వ్యవసాయ తోటలో జరిపారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న అనంతరెడ్డి ఘాట్ వద్దకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ చేరుకుని అనంత రెడ్డి కూమారుడు గోనుగుంట్ల విజయకుమార్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు, అయన అబిమానులు భారీగా వెళ్లి ఘాట్ వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చల్లా శ్రీనివాసులు, గోనుగుంట్ల నారాయణరెడ్డి, జక్కంపూటి నాగభూషణ, లక్ష్మీనారాయణ, మండలశ్రీనివాసులు, చితంబర్‌రెడ్డి, సురేంద్ర, నారాయణస్వామి, రవి, సూరి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ధర్మవరం, జనవరి 28: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో ఆదివారం లయన్ క్లబ్ ఆస్పత్రి వ్యవస్థాపకుడు పిట్టా వెంకటస్వామి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఇందులో కంటిచూపు మందగించిన 45 మందికి వైద్యులు పరీక్షించి 23 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఆపరేషన్ల అనంతరం వారికి కంది అద్దాలను కూడా ఉచితంగా పంపిణీ చేస్తామని క్లబ్ కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఏఐసీటీఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ధర్మవరంరూరల్, జనవరి28: పేదవిద్యార్థులు చదువుతున్న బీబీఏ, బీసీఏ, బీఎంహెచ్ కోర్సులను ఏఐసీటీఈ (అలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్)తో అనుసంధానం చేయడం వల్ల డిగ్రీకళాశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారి పేదవిద్యార్థులకు విద్య అందని ద్రాక్షలా మారుతుందని, వెంటనే ఏఐసీటీఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ప్రగతిశీల విద్యార్థిసంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంజులనరేంద్ర డిమాండ్ చేశారు. పట్టణంలో ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఎన్‌ఈపీ వల్ల ప్రాథమిక విద్యావ్యవస్థ సర్వనాశనం అయిందన్నారు. ప్రస్తుతం ఏఐసీటీఈ పరిధిలోకి బీబీఏ, బీసీఏ, బీఎంహెచ్ కోర్సులను తేవడం వల్ల ఈ ప్రభావం డిగ్రీ విద్యపై పడుతుందన్నారు. ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ కాలేజీల్లో అధిక ఫీజులు చెల్లించలేక విద్యార్థులు డిగ్రీ వైపు వెళుతున్నారన్నారు. అందుకోసం యూనివర్శిటీ పరిధిలోనే డిగ్రీ విద్యావ్యవస్థను ఉంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ విద్యార్థులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు చైతన్య బాషా తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించని నేతలెందుకు ?


కంకర తేలిన మోటువారిపల్లి మట్టి రోడ్డు


మంత్రిని నిలదీస్తున్న గ్రామస్థులు

మోటువారిపల్లి వాసుల ఆగ్రహం

పెనుకొండ రూరల్, జనవరి 28: 'ఎన్నికల్లో మాత్రమే మా గ్రామానికి వస్తారు. మీ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి ఓట్లు వేయించుకుంటారు. మళ్లీ ఎన్నికలు వచ్చే వరకు మా గ్రామం వైపు చూడరు. స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లు అయినా మా గ్రామానికి మట్టిరోడ్డే దిక్కు. తారు రోడ్డు వేసిన నాయకుడేలేడని, అలాంటి నాయకులు మాకొద్దు.' అంటూ మండలం లోని మోటువారిపల్లిలో గ్రామస్థులు మంత్రిని నిలదీశారు. గ్రామంలో రోడ్డు, తాగునీటి సమస్య పరిష్క రించకపోతే ఎన్నికలు బహిష్కరిస్తామని మంత్రి ఉషశ్రీచరణ్ మొహంపైనే గ్రామస్థులు తేల్చి చెప్పారు. మంత్రి ఉషశ్రీ చరణ్ ఆదివారం వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మండలంలోని మోటువారిపల్లిలో ఆత్మీయ పలకరింపు సమావేశానికి వెళ్లారు. మంత్రి గ్రామంలోకి వెళ్లగానే గ్రామస్థులు కాన్వాయిని చుట్టుముట్టారు. తమ గ్రామంలో నాలుగు నెలలుగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, రోడ్డు సౌకర్యం లేదని మంత్రిని నిలదీశారు. వాగ్దానాలు చేస్తారేకానీ తమ సమస్యలు పరిష్కరించరని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోరా అంటూ మంత్రి ఉషశ్రీపై మండిపడ్డారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే ఎన్నికలు బహిష్కరిస్తామంటూ గ్రామస్థులు మంత్రిపై, నాయకులపై మండిపడ్డారు. గ్రామస్థుల ప్రశ్నలతో మంత్రి మెల్లగా అక్కడి నుంచి జారుకున్నారు.

గ్రామానికి మట్టిరోడ్డే దిక్కు

మోటువారిపల్లిలో 150కుటుంబాలున్నాయి. 600జనాభా ఉంది. రెండు బోరు బావుల్లో ఒక్కటి మాత్రమే పనిచేస్తోంది. ఆర్నెల్లుగా గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని నాయకులకు, అధికారులకు చెప్పినా సమస్య పరిష్కరించలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లయినా మా గ్రామానికి మట్టిరోడ్డే దిక్కన్నారు. గర్భిణులు, బాలింతలు ఈ రోడ్డులో ప్రయాణించాలంటే తీవ్ర నరకయాతన అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా అనారోగ్యం పాలై 108కు ఫోన్‌చేస్తే మీ గ్రామానికి రోడ్డు సరిగాలేదని వారు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. సమస్యలు పరిష్కరించేంతవరకు తాము ఎన్నికలు బహిష్కరిస్తామని గ్రామస్థులు మండిపడ్డారు.

రోడ్డు వేయకపోతే ఎన్నికలు బహిష్కరిస్తాం



దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లవుతోంది. ఇప్పటి వరకు మా గ్రామానికి తారు రోడ్డులేదు. నాయకులు, అధికారులు మా సమస్య పరిష్కరించలేదు. మా సమస్యలు పరిష్కరించకపోతే ఎన్నికలు బహిష్కరిస్తాం.

- అనసూయమ్మ, మోటువారిపల్లి

సమస్య పరిష్కరించని వారు మాకొద్దు



ఆర్నెల్లుగా గ్రామంలో తీవ్ర తాగునీటి సమస్య ఉంది. అధికారులకు, నాయకులకు చెబుతున్నాం. ఎన్నికలప్పుడు మాత్రం సమస్య పరిష్కరిస్తామని మాటిస్తారు. ఎన్నికల తరువాత గ్రామంవైపు తిరిగి చూడరు. సమస్య పరిష్కరించలేని నాయకులు మాకొద్దు.

- మంగమ్మ, మోటువారిపల్లి

ఆడపిల్లలు పైచదువులకు వెళ్లలేకపోతున్నారు



అమ్మవారిపల్లి జాతీయ రహదారి నుంచి మా గ్రామానికి వెళ్లాలంటే 5కి.మీ. అవుతుంది. కొన్నేళ్ల నుంచి మట్టిరోడ్డే ఉంది. వర్షాకాలంలో అమ్మవారిపల్లి, గుట్టూరుకు రహదారిలో ప్రయాణించాలంటే గర్భిణులు, బాలింతలు చాలాబాధలు అనుభవిస్తున్నారు. అనేకసార్లు ఆ రహదారిలో ప్రమాదాలు జరిగే గాయాల పాలయ్యాం. రోడ్డు సరిగా లేకపోవడంతో విద్యార్థులు 10వ తరగతి వరకు చదివి, ఆపై చదువులు మానేస్తున్నారు. మా గ్రామానికి ఆటోకూడా రాదు. కాలినడకనే ప్రయాణించాలి. మౌలిక సదుపాయాలు లేని మా గ్రామానికి ఆడపిల్లను ఇచ్చేవారు జంకుతున్నారు.

- చంద్రిక, సరోజమ్మ, మోటువారిపల్లి

ఎమ్మెల్యే పై ఓ దళిత యువకుడి విమర్శలు

సోషల్ మీడియాలో వైరల్


సీఎంను వేడుకుంటున్న దళిత యువకుడు

మడకశిర రూరల్ , జనవరి 28 : స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామిపై ఓ దళిత యువకుడు సోషల్ మిడియాలో చేసిన విమర్శలు వైరల్ అయి హల్‌చల్ చేస్తున్నాయి. అతడు ఇలా ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తాను మండలంలోని వైబీ హళ్లికి చెందిన ఓ దళితుడినని, పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్నాననంటున్నాడు. ఎమ్మెల్యే తిప్పేస్వామి తమ గ్రామానికి చేసింది ఏమిలేదని విమర్శించాడు. మంజూరైన సీసీ రోడ్డును కూడా అమ్మకున్నాడని, ప్రతి ఉద్యోగానికి డబ్బులు తీసుకున్నాడని ఆరోపించాడు. ఆయనను టీటీడీ బోర్డు సభ్యత్వం నుంచి కూడా తొలగించాలని ముఖ్యమంత్రిని వేడుకుంటున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ హల్‌చల్ చేస్తోంది.

'మూర్ఛవ్యాధి ప్రమాదకరం కాదు'

పెనుకొండ, జనవరి 28 : మూర్ఛ వ్యాధి అనేది ప్రమాదకరమైనది కాదని, క్రమంగా మందులు వాడితే పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. స్థానిక ఘనగిరి పాఠశాల ఆవరణంలో ఆదివారం మూర్ఛవ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేవీవీ జిల్లా కార్యదర్శి హరి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా వైద్యులు గోపాలం, శివనారాయణ, ఈటీ రామ్మూర్తి, అలేఖ్య హాజరై ప్రసం గించారు. శిబిరంలో పెనుకొండ పరిసర ప్రాంతాలకు చెందిన 36మంది వ్యాధిగ్రస్థులకు చికిత్స చేశారు. నెలకు సరిపడ మందులను అందించారు. ఈ వైద్యశిబిరం ప్రతినెలా నాలుగో ఆదివారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్ అధ్యక్షుడు నబీ, ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్‌ఖాన్, సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, యూటీఎఫ్ రమేష్, ఘనగిరిపాఠశాల కరస్పాండెంట్ ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

14న ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

హిందూపురం అర్బన్, జనవరి 28: పట్టణ పరిధిలోని మేళాపురం దండురోడ్డులో నూతనంగా ఏకశిల అంజనేయస్వామి, మహాగణపతి, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. 27 అడుగుల ఎత్తులో ఏకశిల ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఫిబ్రవరి నెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

రేపు మండల సమావేశం

గోరంట్ల, జనవరి 28: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథ్ గుప్త తెలిపారు. ఉదయం 10.30గంటలకు జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అన్నిశాఖలాధికారులు తప్పకుండా హాజరుకావాలన్నారు. అధికారులు తమ ప్రగతి నివేదికలతో రావాలని తెలిపారు. ఎన్నికైన సభ్యులను మాత్రమే సమావేశానికి అనుమతిస్తామని, ఇతరులు పాల్గొనడానికి వీలు లేదని ఆయన ఆజెండాలో పేర్కొన్నారు.

ద్విచక్రవాహనం బోల్తా

యువకుడికి గాయాలు

గోరంట్ల, జనవరి 28: మండలంలోని పుట్టపర్తి రహదారిలో కరావులపల్లి వద్ద ఆదివారం ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఈ సంఘటనలో బాబా అనే వ్యక్తి తీవ్రవంగా గాయపడ్డాడు. పుట్టపర్తి మండలంలోని పెడబల్లికి చెందిన ఫకృద్దీన్ కుమారుడు బాబా గోరంట్లకు వచ్చి తిరిగి వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో అతడి కుడిచేయి, కుడి పాదం ఫ్యాక్చర్ కావడంతో గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అనంతరం మెరుగైనవైద్యం కోసి 108 పుట్టపర్తి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మరొకరికి గాయాలు

బత్తలపల్లి, జనవరి 28: మండలంలోని కోడేకండ్ల వద్ద ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా .. మరొకరు గాయపడ్డారు. వివరాల్లోకెళ్తే.. బుక్కపట్నం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన నరసింహులు, రమేష్ బైక్‌లో ఆదివారం బత్తలపల్లికి వచ్చారు. కొద్దిసేపు అనంతరం తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలోని కోడేకండ్ల వద్దకు రాగానే బైక్‌ను బత్తలపల్లి నుంచి కదిరికి వెళ్లే ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తూ ఢీకొంది. ప్రమాదంలో బైక్‌లోని ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వీరిని 108 వాహనంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. నరసింహులు చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందాడు. మృతుడికి భార్య గంగాదేవి, కుమారుడు హర్షవర్ధన్ ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ శ్రీనివాసులు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

దివ్యాంగుడికి కృత్రిమ కాలు వితరణ

హిందూపురం అర్బన్, జనవరి 28: ఓ దివ్యాంగుడికి కృత్రిమ కాలు వితరణగా అందించి హిందూపురం మేళాపురం ప్రాంతానికి చెందిన మంజునాథ్, బెంగళూరుకు చెందిన మయాంక్ తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ముద్దిరెడ్డిపల్లికి చెందిన 32 సంవత్సరాల గజేంద్ర కుమార్‌కు చక్కెర వ్యాధి వల్ల కాలు గ్యాంగ్రిన్ ఎక్కువ కావడంతో బెంగళూరులో మూడు నెలల కిందట కాలు తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న దాతలు మహారాష్ట్రలోని పూణేకు అతడిని పంపి మూడు రోజుల పాటు అక్కడే చికిత్సలు అందించారు. తొలగించిన కాలు కొలతలు తీసుకున్న తరువాత అక్కడ అతడికి కృత్రిమ కాలు అందించారు. దాతలు రూ. 45 వేలు వెచ్చించి అతడికి కృత్రిమ కాలు అందించారు. ఈ సందర్భంగా ఆదివారం దివ్యాంగుడు దాతలకు కృతజ్ఞతలు తెలిపాడు.

నవరత్నాలు కాదు.. రాళ్లు : కందికుంట

● వైసీపీ నుంచి టీడీపీలోకి పలువురి చేరిక

నంబులపూలకుంట, జనవరి 28: వైసీపీ పాలనలో ప్రజలు సంతోషంగా లేరని, సీఎం జగన్ ప్రవేశపెట్టినవి నవరత్నాలు కాదని, అవి రాళ్లని, వాటి వల్ల ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని టీడీపీ నియోజకవర్గ కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. మండలంలోని వెలిచెలమల క్రాస్‌లో ఆదివారం టీడీపీ నాయకుల, కార్యకర్తల సమావేశం జరిగింది. ఇందుకు కందికుంట విచ్చేశారు. ఆయన రాగానే స్థానిక నాయకులు బైక్‌ర్యాలీతో, పూలమాలలు, హారతులతో స్వాగతం పలికారు. అనంతరం సమావేశంలో పలువురు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. వారికి కందికుంట కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు నవరత్నాలు కాదని, రాళ్లు అని పేర్కొన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఏ వర్గం ప్రజలు సంతోషంగా లేరన్నారు. ఈ ప్రభుత్వంలో అన్నీ సమస్యలు, కష్టాలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎన్‌పీ కుంట మండలం టీడీపీకి పెట్టని కోట అన్నారు. ఇక్కడి ప్రజలు టీడీపీని ఎంతో ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. హంద్రీనీవా కాలువల ద్వారా ఈప్రాంతాన్ని సస్యశ్యామల చేశామని అధికారపార్టీ నాయకులు చెబుతున్నారని, 90 శాతం పనులను గత టీడీపీ హయాంలో పూర్తి చేస్తే, కనీసం 10 శాతం పనులు కూడా వైసీపీ ప్రభుత్వం పూర్తిచేయలేకపోయిందని మండిపడ్డారు. కాంట్రాక్టులు సైతం చేసిన పనులకు బిల్లులు అందక అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. ఎన్నికల హామీలను ఏ ఒక్కటీ సరిగా అమలు చేయలేదని దుయ్యబట్టారు. రాష్ట్రం మళ్లీ అభివృద్ధి పథంలో నడవాలంటే చంద్రబాబు సీఎం కావాలని చెప్పారు. ప్రజలు వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి సహకరించాలని కోరారు. పార్టీలో చేరినవారిలో మాజీ సర్పంచ్ భర్త రఘునాథ్‌రెడ్డి, జనార్దన్‌యాదవ్, చిన్నయ్య, సొసైటీ మాజీ డైరెక్టర్ గంగిరెడ్డి, వైసీపీ యూత్ కన్వీనర్ వేణుగోపాల్, భాస్కర్‌తోపాటు 40కుటుంబాల వారు చేరారు. కార్యక్రమంలో కన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు, విజయ్‌కుమార్‌యాదవ్, బసిరెడ్డి, నాగేశ్వర్, వెంకటయ్య, బాబు, చిన్నరమయ్య, పోమేనాయక్, నాయకులు, రాజశేఖర్‌బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కందికుంట ప్రసాద్

రసాభాసగా సాధుచెట్టి సంఘం ఎన్నిక

హిందూపురం, జనవరి 28 : స్థానిక కంచికామాక్షి కల్యాణమండపంలో సాధుచెట్టి సంఘం సర్వసభ్యసమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో రెండు వర్గాలుగా విడిపోయి కుర్చీలు గాలిలోకి లేచాయి. సమావేశం రసాభాసగా మారింది. మొన్నటిదాకా అధ్యక్షుడిగా ఉన్న జేఈ వెంకటస్వామి పదవికి రాజీనామా చేశాడు. దీంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు సమావే శమయ్యారు. ఈ సందర్భంగా వెంకటస్వామినే కొనసాగించాలని కొంతమంది పేర్కొన్నారు. మరో వర్గంవారు కొత్తకమిటీని ఎన్నుకోవాలని పట్టుబట్టారు. సమావేశం రసాభాసగా మారడంతో వెంకటస్వామి మరికొంతమంది కలిసి వెంకటస్వామి అధ్యక్షుడిగా కొనసాగుతారని కమిటీని ప్రకటించారు. మరోవర్గం వారు దీనిని వ్యతిరేకించారు. అవసరమైతే ఎన్నిక పెట్టాలని పట్టుపట్టారు. అంతేకాక అడహాక్ కమిటీ సభ్యులను, కులసంఘం పెద్దలను కాదని వెంకటస్వామి ఎలా అధ్యక్షుడవుతారని కులానికి సంబంధించి మహేష్, నాగరాజు, రామ య్య, గోపాల్ ప్రశ్నించారు. దీనిపై స్పందిస్తూ తానే అధ్యక్షుడినని వెంకటస్వామి చెప్పుకొచ్చారు. నేను రాజీనామాచేసిన విషయం వాస్తవమేకానీ దానిని ఎవరూ ఆమోదించలేదన్నారు. కష్టకాలం నుంచి తానే ఉన్నానని, తమకు కులస్థుల బలముందన్నారు. గొడవ జరుగుతున్న విషయం తెలుసుకుని ఎస్‌ఐ హారుణ్‌బాష సిబ్బందితో వెళ్లి ఇరువర్గాలకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు.

పూర్వ విద్యార్థుల వితరణ


మాట్లాడుతున్న గురుకుల పాఠశాలల కార్యదర్శి క్రిష్ణమోహన్

లేపాక్షి, జనవరి 28: స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో పూర్వ విద్యార్థులు నటరాజ్ బృందం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రూ.2.50లక్షలు విలువచేసే టీషర్టులను అందజేశారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల కార్యదర్శి క్రిష్ణమోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు పాఠశాలపై చూపుతున్న ఔదార్యాన్ని కొనియాడారు. ప్రతి విద్యార్థి పాఠశాలల అభివృద్ధికి కృషిచేయాలన్నారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి

గోరంట్ల, జనవరి 28: మండలంలోని గౌనివారి పల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు రంగనాయ కుల మృతి విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత ఆదివారం వేర్వేరుగా వెళ్లి భౌతిక కాయాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

సెబ్ మెరుపుదాడులు

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న కారు, కర్ణాటక మద్యాన్ని చూపుతున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

హిందూపురం, జనవరి 28 : ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ మాధవరెడ్డి రాష్ట్ర సరిహద్దులపై గట్టి నిఘా ఉంచాలని పోలీసులను ఆదేశించారు. దీంతో సెబ్ అధికారులు ఆదివారం మెరుపు దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో భారీ ఎత్తున కర్ణాటక మద్యం పట్టుకున్నట్లు పుట్టపర్తి టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి, హిందూపురం సెబ్ సీఐ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. లేపాక్షి మండల పరిధిలో దాడులు చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని ఒక కారు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 39కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను సీజ్ చేశామని తెలిపారు. అదేవిధంగా చింతలపల్లి క్రాస్ నుంచి అక్రమంగా కర్ణాటక మద్యం తీసుకొస్తున్న హిందూపురం పట్టణానికి చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 15బాక్సుల మద్యం ప్యాకెట్లు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారి మోహన్‌రెడ్డి చోళసముద్రం హైవేపై కారులో తనిఖీ చేయగా అందులో 20బాక్సులు కర్ణాటక మద్యం పట్టుబడింది. ఇందులో కారును సీజ్ చేయగా మద్యం తరలిస్తున్న వ్యక్తి పరారైనట్లు తెలిపారు.

'ఏఐసీటీఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి'

ధర్మవరంరూరల్, జనవరి28: పేదవిద్యార్థులు చదువుతున్న బీబీఏ, బీసీఏ, బీఎంహెచ్ కోర్సులను ఏఐసీటీఈ (ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్)తో అనుసంధానం చేయడం వల్ల డిగ్రీకళాశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ప్రగతిశీల విద్యార్థిసంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంజులనరేంద్ర అన్నారు. దీంతో పేదవిద్యార్థులకు విద్య అందని ద్రాక్షలా మారుతుందని, వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ప్రగతిశీల విద్యార్థిసంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంజులనరేంద్ర డిమాండ్ చేశారు. పట్టణంలో ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఎస్ఈపీ వల్ల ప్రాథమిక విద్యావ్యవస్థ సర్వనాశనం అయిందన్నారు. ప్రస్తుతం ఏఐసీటీఈ పరిధిలోకి బీబీఏ, బీసీఏ, బీఎంహెచ్ కోర్సులను తేవడం వల్ల ఈ ప్రభావం డిగ్రీ విద్యపై పడుతుందన్నారు. ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ కాలేజీల్లో అధికఫీజులు చెల్లించలేక విద్యార్థులు డిగ్రీ వైపు వెళుతున్నారన్నారు. అందుకోసం యూనివర్సిటీ పరిధిలోనే డిగ్రీ విద్యావ్యవస్థను ఉంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ విద్యార్థులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

మూడు నెలల్లో దిగిపోవడానికి 'సిద్ధం'గా జగన్ : గుండుమల



మడకశిరటౌన్, జనవరి 28: వచ్చే సార్వత్రిక ఎన్నికలకు సిద్ధమని ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శంఖారావం పూరించారని, అయితే అది కేవలం మూడు నెలల్లో తాను దిగిపోవడానికి సిద్ధంగా ఉన్నానని సూచిస్తూ శంఖారా వం పూరించినట్లుగా ఉందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పే స్వామి ఎద్దేవ చేశారు. ఆయన ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాటా డారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే దిగిపోవడానికి ఏ మాత్రం ఆలోచించమని ముఖ్యమంత్రి తెలిపారన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో అభివృద్ధి చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుకే దక్కు తుందని, అదేవిధంగా రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను దెబ్బతీసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రజల్లో వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిందని, ముఖ్య మంత్రి జగన్ తాను దిగిపోవడానికి సిద్ధంగా ఉన్నానని పరోక్షంగా సంకేతాలు ఇచ్చినట్లే అన్నారు. తన ఐదేళ్ల పాలనలో ప్రజా వనరులను, ప్రజల్ని దోచుకొన్నది దాదాపు రూ.4లక్షల కోట్లు అన్నారు. పెట్టుబడి పెట్టడానికి వచ్చిన వారిని బెది రించిన ఘనత, విద్యా వ్యవస్థను నాశనం చేసిన ఘనత కూడా జగన్‌కే దక్కు తుందన్నారు. నాణ్యమైన విద్య అందించడంలో 2018లో దేశంలో మూడో స్థానం లో ఉన్న రాష్ట్రం ప్రస్తుతం 19వ స్థానానికి పడిపోయిందన్నారు. ఒక్క చాన్స్ అన్నందుకు నమ్మి అధికారం ఇచ్చినందుకు నష్టపోయిన ప్రజలు గద్దె దింపేం దుకు ఎదురు చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. జగన్ గద్దె దిగేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన సిద్ధం కార్యక్రమం ద్వారా తెలిసిపోతోందన్నారు.

ఎన్‌సీసీ సర్టిఫికెట్‌తో ఉద్యోగాల్లో ప్రాధాన్యం

కొడిగెనహళ్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్


ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు, అధికారులు

హిందూపురం అర్బన్, జనవరి 28: ఎన్‌సీసీ సర్టిఫికెట్‌తో ఉద్యోగాలకు వెళ్లినపుడు ప్రాధాన్యముంటుందని కొడిగెనహళ్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు తెలిపారు. పరిగి మండలంలోని కొడిగెనహళ్లి గురుకుల పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ ప్రాక్టికల్, థియరీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ ఉద్యోగాలకు ఎన్‌సీసీ సర్టిఫికెట్‌పై వెయిటేజ్ మార్కులు ఉంటాయన్నారు. ఈ పరీక్షలకు ఏపీ ఆర్ఎస్ కొడిగెనహళ్లి, లేపాక్షి నవోదయ, హిందూపురం చిన్మ య, జడ్పీహెచ్ఎస్ సోమందేపల్లి, జడ్పీహెచ్ఎస్ పెనుకొండ, కిరికెర ఎల్ఆర్‌జీ పాఠశాలల నుంచి 202 మంది విద్యార్థులు హాజరయ్యారు. బాలుర విభాగానికి ఆరో ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ ఎంఎస్ కులకర్ణి, బాలికల విభాగానికి కమాండింగ్ అధికారి కల్నల్ ఎల్‌డీ ర్యోడ్రిక్స్ హాజరయ్యారు. పాఠశాల ఎన్‌సీసీ అధికారి అరుణ్‌కుమార్, వివిధ పాఠశాలల ఎన్‌సీసీ అధికారులు హాజరయ్యారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్

పెనుకొండ, జనవరి 28: స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంప్‌లో భాగంగా ఆదివారం వైబ్రోనిక్ మెడికల్ క్యాంప్ నిర్వహించారు. స్థానిక గగన్మహల్ వద్ద స్లోవేనియా దేశానికి చెందిన సత్యసాయిబాబా భక్తురాలు అన్నేజోన్ రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ వైబ్రానిక్ మందులతో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ ఉండవన్నారు. అయితే వాటిని టీవీలకు, మొబైల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలన్నారు. ఇది అన్ని రోగాలకు పని చేస్తుందన్నారు. వసతి గృహం అధికారి వెంకటేశ్, తెలుగుభాష ఉపాధ్యాయుడు రామన్న, ఎన్ఎస్ఎస్ పీఓ రంగనాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలకు తరలివెళ్లిన రజకులు

లేపాక్షి, జనవరి 28 : అనంతపురం జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన రజకుల మహాస భలకు మండల పరిధిలోని రజకులు తరలివెళ్లారు. దీనికోసం ఎమ్మెల్యే బాలక్రిష్ణ ప్రత్యేక బస్సుల ను ఏర్పాటు చేసినట్లు టీడీపీ మండల కన్వీనర్ జయప్ప తెలిపారు. బస్సుతోపాటు రూ.15వేలు నగదును రజకులకు అందజేశారు. దీంతో ఎమ్మెల్యే బాలయ్యకు రజకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జయప్ప, మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బీసీ సదస్సును విజయవంతం చేయండి: జడ్పీటీసీ

అగళి, జనవరి 28 : జయహో బీసీ సదస్సును విజ యవంతం చేయాలని అగళి జడ్పీటీసీ ఉమేష్ పేర్కొన్నారు. నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం ఉదయం 10.30కు బీసీ సదస్సు నిర్వహించనున్నట్లు ఆయన తెలి పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో పాటు జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారధి హాజరవుతా రన్నారు. కావున మండలంలోని బీసీ కులస్థు లంతా ఏక తాటిపైకి వచ్చి టీడీపీ కండువావేసుకుని మండల కేం ద్రంలోని కన్యకాపరమేశ్వరీ దేవాలయం వద్దకు రావాలన్నారు.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం


గోరంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గోరంట్ల, జనవరి 28: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల, సరస్వతి విద్యామందిరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం వేర్వేరుగా సమావేశమై వారి తీపి జ్ఞాపకాలను పంచుకున్నారు. బాలుర ఉన్నత పాఠశాలలో 1980-81లో పదో తర గతి చదవిన పూర్వ విద్యార్థులు ముందుగా గోరంట్లలో ప్రధాన రహదారిపై ప్రదర్శనగా తాము చదువుకున్న పాఠశాల వద్దకు వెళ్లారు. తాము చదువుకున్న రోజుల్లో మధుర స్మృతులను ముచ్చటించుకున్నారు. అనంతరం పట్టణంలోని వాసవి మహల్‌లో సమావేశమై తమకు చదువు చెప్పిన అప్పటి ఉపాధ్యాయులు రఘురామిరెడ్డి, శంకర్ నారాయణ, ఓబిరెడ్డి, సుబ్రహ్మణ్యం, కుళ్లాయప్పను శాలువలు, పూలమాలలు, నూతన వస్త్రాలతో సత్కరించారు. అలాగే పట్టణంలోని సరస్వతి విద్యామందిరంలో 2010-11లో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆ పాఠశాలలలో సమావేశమయ్యారు. ఒకరినొకరు పలుకరించుకుని, గత స్మృతులను నెమరు వేసుకున్నారు. తమకు చదువు చెప్పిన ప్రధానోపాధ్యాయుడు నరసింహులుతో పాటు మొత్తం 22మంది ఉపాధ్యాయులను సన్మానించారు.

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన 1993-95బ్యాచ్ ఇంటర్ పూర్వ విద్యార్థులు 30ఏళ్ల తర్వాత ఒకేచోట కలిసి గత స్మృతులను నెమరువేసుకున్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో ఆదివారం ఇంటర్ పూర్వ విద్యార్థులు హైకోర్టు న్యాయవాది శివరామక్రిష్ణ, మాధవి, కళాభారతి ఆధ్వర్యంలో 40 మంది ఒకేచోట కలిశారు. అప్పటి తీపి గుర్తులను తలుచుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం త మకు చదువు చెప్పిన లెక్చరర్ శ్రీరాములు కుమారుడు ప్రస్తుత లెక్చరర్ మూర్తిని ఘనంగా సత్కరించారు. తాము చదువుకున్న కళాశాలకు తమ వంతుగా ఏదైనా చేయాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు వారు తెలిపారు.


పెనుకొండ జూనియర్ కళాశాలలో..


గోరంట్లలోని సరస్వతి విద్యామందిరంలో సమావేశమైన పూర్వ విద్యార్థులు